RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  సంపుటి : 1 సంచిక:66  8-10-2025  బుధవారం  ఎడిటర్ :మర్రి పవీణ్  పేజీలు : 8  వెల 4 /-

## నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు కుటుంబం...

### రామ్మూర్తినాయుడుకు నివాళి

స్వగ్రామం నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు కుటుంబం నారా రామ్మూర్తినాయుడు ప్రథమ వర్థంతి కార్యక్రమంలో పాల్గొన్న వైనం నటుడు నారా రోహిత్ చేతుల మీదుగా జరిగిన కార్యక్రమాలు స్మృతివనం వద్ద రామ్మూర్తినాయుడుకు నివాళులర్పించిన కుటుంబ సభ్యులు ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న మంత్రి నారా లోకేశ్



నారావారిపల్లె, అక్టోబర్ 7(టుడే విదుర) : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు తమ స్వగ్రామం నారావారిపల్లెను సందర్శించారు. కుటుంబపరమైన ఒక ముఖ్యమైన కార్యక్రమంలో పాల్గొనేందుకు వారు గ్రామానికి విచ్చేశారు. చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా నేడు సంవత్సరీకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. నారావారిపల్లెలోని వారి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో రామ్మూర్తినాయుడు తనయుడు, నటుడు నారా రోహిత్ సంవత్సరీకం క్రతువు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులందరూ కలిసి రామ్మూర్తినాయుడు స్మృతివనం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన స్మృతులను గుర్తుచేసుకుని పుష్పాంజలి అర్పించారు. ఈ కుటుంబ కార్యక్రమానికి సంబంధించిన పలు ఫొటోలను మంత్రి నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి, నారా రోహిత్‌తో పాటు ఇతర బంధువులు కూడా ఈ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

### స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాకారం..

# పారిశుద్ధ్య కార్మికులే దేవుళ్లు: సీఎం చంద్రబాబు

పారిశుద్ధ్య కార్మికులే నిజమైన దేశభక్తులని కొనియాడిన సీఎం చంద్రబాబు విజయవాడలో స్వచ్ఛాంధ్ర అవార్డులను ప్రదానం చేసిన ముఖ్యమంత్రి జనవరి 1 నాటికి రాష్ట్రాన్ని జీరో వేస్ట్ గమ్యానికి చేర్చడమే లక్ష్యం గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేస్తే.. మేం సంపద సృష్టించామని వెల్లడి పారిశుద్ధ్య కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం ప్రతి ఏటా స్వచ్ఛాంధ్ర అవార్డులు ఇస్తామని సీఎం ప్రకటన



విజయవాడ, అక్టోబర్ 7(టుడే విదుర): రాష్ట్రంలో పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులే నిజమైన దేశభక్తులని, వారిని చూస్తుంటే ఆపరేషన్ సిందూర్ వీరులు గుర్తుకొస్తున్నారని సీఎం చంద్రబాబు కొనియాడారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని, ఈ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... “మన పరిసరాలు, మన రాష్ట్రం పరిశుభ్రంగా ఉన్నాయంటే దానికి కారణం పారిశుద్ధ్య కార్మికులే. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి మన ఆరోగ్యాన్ని కాపాడుతున్న వారు దేవుడితో సమానం. తెల్లవారుజామున 4 గంటలకే విధులకు హాజరయ్యే వారి రుణం తీర్చుకోలేనిది” అని భావోద్వేగంగా అన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలు, వ్యక్తులకు 21 కేటగిరీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను ఆయన అందజేశారు.

**చెత్తపై పన్ను కాదు.. చెత్తతో సంపద సృష్టిస్తున్నాం: చంద్రబాబు**

గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసి ప్రజలను ఇబ్బంది పెడితే, తమ కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చంద్రబాబు స్పష్టం చేశారు. “మేం అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. తిరుమలలో సైతం ఇదే పరిస్థితి. మేం వచ్చాక చెత్త పన్ను రద్దు చేయడమే కాకుండా, పేరుకుపోయిన చెత్తను తొలగించాం” అని తెలిపారు. జనవరి 1వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 'జీరో వేస్ట్' రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు.

**పారిశుద్ధ్య కార్మికులకు రూ. కోటి బీమా**

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తి వైకల్యానికి గురైనా వారి కుటుంబానికి రూ. కోటి బీమా అందించేలా యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. దీంతో పాటు వారి కుటుంబాలకు ఆరోగ్య బీమా, పిల్లల చదువులకు ఆర్థిక సాయం వంటి సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు.

**'యూజ్ అండ్ త్రో' విధానానికి స్వస్తి**

'యూజ్ అండ్ త్రో' విధానానికి స్వస్తి పలికి 'యూజ్-రికవర్-రీయూజ్' పాలసీని అమలు చేస్తున్నామని, వ్యర్థ పదార్థాలను ఆదాయ వనరుగా మార్చేందుకు 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు' ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రజల నుంచి పొడి చెత్త సేకరించి, బదులుగా నిత్యావసరాలు అందించే 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని మరో 100 మండలాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రతి ఏటా స్వచ్ఛాంధ్ర అవార్డులు అందజేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, కొలుసు పార్థసారథి, స్వచ్ఛాంధ్ర ఛైర్మన్ పట్టాభి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పార్టీ మారితే పదవికి రాజీనామా చేయాలి..



నెల్లూరు,(టుడే విదుర): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఖండించారు. దాడికి ప్రయత్నం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఛీఫ్ జస్టిస్‌కి సంబంధించిన అంశం కాదు, సమాజానికి, వ్యవస్థకి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పార్టీ మారితే.. ఆ పార్టీ ద్వారా పొందిన పదవికి రాజీనామా చేయాలని వెంకయ్యనాయుడు తెలిపారు. రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ని సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది: జగన్



(టుడే విదుర): సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రికి పాలనమీద ధ్యాస లేదన్నారు. సొంత ఆదాయాలు పెంచుకోవడమే వారికి పనిగా ఉందన్నారు. రాష్ట్ర ఖజానాకు కావలిసిన ఆదాయాలు తగ్గుతున్నాయి. చంద్రబాబు, ఆయన కుమారుడు బినామీల జేబుల్లోకి ఆదాయాలు వెళ్తున్నాయన్నారు. కల్తీ మద్యం తాగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని జగన్ ధ్వజమెత్తారు.

### పేద విద్యార్థికి వైద్య విద్య..

## ఇదే కూటమి సర్కార్ లక్ష్యం: మంత్రి సత్యకుమార్



విశాఖపట్నం, అక్టోబర్ 7(టుడే విదుర): గత ప్రభుత్వం అసమర్థ పాలన వలన మెడికల్ కళాశాలలకు ఈ దుస్థితి వచ్చిందని మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే గత ఐదేళ్లలో కనీసం భూసేకరణ కూడా చేయలేదని.. హాస్పిటల్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం పట్టించుకోలేని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. పాడేరులో మెడికల్ కళాశాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేయకపోతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గిరిజన ప్రాంతాలను విస్మరించిందని.. గిరిజన విశ్వవిద్యాలయం రాకుండా అడ్డుకున్నాని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం పాపాలు తమకు శాపాలుగా మారాయని వ్యాఖ్యలు చేశారు. పీపీపీకి ప్రైవేటైజేషన్‌కు తేడా తెలియ కుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి దుయ్యబట్టారు.

### పవన్ కల్యాణ్ సూచన మేరకు

## ఉప్పాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతతో ప్రభుత్వ నిర్ణయం కమిటీ ఏర్పాటు చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ కమిటీలో కీలక శాఖల కమిషనర్లు, జిల్లా కలెక్టర్ మత్స్యకార ప్రతినిధులకు కూడా కమిటీలో చోటు సీఎం, మంత్రికి ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

కాకినాడ , అక్టోబర్ 7(టుడే విదుర): కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు, ఈ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో పలువురు కీలక అధికారులు సభ్యులుగా వ్యవహరించనున్నారు. పరిశ్రమల శాఖ, మత్స్యశాఖ కమిషనర్లతో పాటు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ, కాకినాడ జిల్లా కలెక్టర్ ఇందులో ఉంటారు. స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన కోసం, మత్స్యకార వర్గం నుంచి జిల్లా కలెక్టర్ నామి నేట్ చేసే ప్రతినిధులకు కూడా ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఉప్పాడ మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ఈ కమిటీ పనిచేయనుంది.

## పైడితల్లి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి



విజయనగరం, అక్టోబర్ 7(టుడే విదుర): నేడు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాం నారాయణరెడ్డి పైడితల్లి అమ్మవారిని దర్శించుకొని, పట్టు వస్త్రాలను సమర్పించారు. అలాగే రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత కూడా అమ్మవారిని దర్శించుకుని ఘటం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

## విద్యార్థినీలను పరామర్శించిన షర్మిల



పార్వతీపురం, అక్టోబర్ 7(టుడే విదుర):రెండు రోజుల క్రితం పచ్చకామెర్లతో బాధపడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినీలను కెజిహెచ్ కు తరలించిన సంగతి తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీలను ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం పరామర్శించారు.

## అయోధ్యలోప్రపంచ రికార్డు లక్ష్యంగా 'దీపోత్సవ్'

అయోధ్య, అక్టోబర్ 7(టుడే విదుర): అయోధ్యలో అక్టోబర్ 19న జరిగే 'దీపోత్సవ్ 2025'కు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2,100 మంది భక్తులతో 2.6 మిలియన్ల దీపాలు వెలిగించి ప్రపంచ రికార్డు సృష్టించనున్నట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. 1,100 డ్రోన్ల అద్భుత ప్రదర్శన కూడా ఉండనుంది. 56 ఘాట్‌లపై వేడుకలు జరగనున్నాయి. అక్టోబర్ 18న భద్రతా ఏర్పాట్ల మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు.

# సంపాదకీయం

## సాంస్కృతిక అస్తిత్వాన్ని ఎలా నిలబెట్టాలో స్పష్టత ఉన్నది

ఉమ్మడి నల్లగొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన డాక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి కవి, రచయిత, విమర్శకులు, అనువాదకులు. మీర్ లాయక్ అలీ రచన 'ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్'ను 'హైదరాబాదు విషాదం'గాను, వి.పి. మీనన్ రచన 'ద స్టోరీ ఆఫ్ ద ఇంటిగ్రేషన్ ఆఫ్ ద ఇండియన్ స్టేట్స్'ను 'అసఫ్ జాహీ సంస్థానం విలీన గాథ'గా తెలుగులోకి అనువదించి సెప్టెంబర్ 17 పరిశీలనకు కొత్త కోణాన్ని అందించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వీరి 'మట్టిపాట', 'తెలంగాణ రుబాయిలు' రచనలు సాహిత్యాభిమానుల మనసును చూరగొన్నాయి. 2017లో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా నియమితులై ప్రపంచ తెలుగు మహా సభలు విజయవంతమయ్యేందుకు కృషి చేశారు. ఇటీవల తెలంగాణ భాషా సాంస్కృ తిక శాఖ సంచాలకులుగా నియమితులైన సందర్భంగా ఆయనతో సంభాషణ:%తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా నియమితులైన సందర్భాన మీకు శుభాకాంక్షలు. మీరు ఈ పదవిలో నియమించబడిన మొదటి పక్షంలోనే తెలంగాణ బతుకమ్మకు రెండు గిన్నిస్ రికార్డులు రావడం పట్ల మీ స్పందన ఏమిటి?తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఇదొక అత్యంత ఉత్సాహవంతమైన సందర్భం. 63.11ఫీట్ల ఎత్తు బతుకమ్మకు ఒక గిన్నిస్ రికార్డు, 1500మంది మహిళల బతుకమ్మ ఆటలోని ఏకత్వానికి మరో గిన్నిస్ రికార్డు సాధించాం. తక్కువ వ్యవధిలో సరైన ప్రణాళికతో, పర్యాటక%–%సాంస్కృతిక శాఖల మధ్య సమన్వయంతో ఇది సాధ్యమైంది.మీరు గతంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఆ అనుభవం ఇప్పుడు ఈ కొత్త హోదాలో ఉపయోగపడుతుంది అని భావించవచ్చా? తప్పకుండా! సాహిత్య అకాడమీలో పనిచేసిన పరిజ్ఞానమే గాక, గత ముప్పై ఏళ్ళుగా వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థలతో నాకున్న అనుబంధం, కవులు రచయితలతో వ్యక్తిగత సాన్నిహిత్యం తప్పనిసరిగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా పనిచేయడంలో నాకు ఉపయోగపడుతుంది. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో కవులు రచయితలను మాత్రమే కాకుండా కళాకారులను కూడా చాలా సందర్భాలలో ఇన్వాల్వ్ చేశాము. ఆ సందర్భంగా తెలంగాణ అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం చేయవలసిన కార్యక్రమాల పట్ల నాకు స్పష్టమైన అవగాహన ఏర్పడింది.విద్యావ్యవస్థలో మార్పులతో ఇంగ్లీష్ భాష డామినేట్ చేస్తున్న పరిస్థితుల్లో తెలంగాణ భాషను కాపాడుకోవడంపై మీ ఆలోచనలు ఏమిటి?రెండు తెలుగు రాష్ట్రాలలోనూ తెలుగు మాధ్యమం ప్రాథమిక పాఠశాలల స్థాయిలో కూడా లేకుండా పోయింది కాబట్టి ఇంకొక ఇరవై ఏళ్ళ తరువాత వచ్చే యువతకు తెలుగుపట్ల సాధికారత ఉండదనే విషయాన్ని ఒప్పుకుని తీరవలసిందే. తెలుగుని ఒక భాషగానైనా తప్పనిసరిగా నేర్చుకోవలసిన అవసరం తెలంగాణ రాష్ట్రంలో అందరికీ ఉంది అని తెలుగు భాషా చట్టం 2018 తెలియజేస్తుంది. దీని ప్రకారం ఏ రకమైన యాజమాన్య నిర్వహణలో ఉన్న పాఠశాలల్లోనైనా తెలుగును ఒక అంశంగా చదివి తీరాలి. కాబట్టి తెలుగును ఆసక్తిగా చదివే విద్యార్థులు భవిష్యత్తులో భాషలో నైపుణ్యాన్ని సాధిస్తారు. ఇక సంస్కృతి విషయానికి వస్తే భాషకు ఉన్నంత డోకా సంస్కృతికి లేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బోనాలు, బతుకమ్మ పండగలకి ఆదరణ పెరిగింది. ప్రభుత్వం వైపు నుండి కూడా ఈ పండుగలను ఉత్సాహభరితంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి కాబట్టి సంస్కృతి పరిరక్షణ, భాషా పరిరక్షణ కంటే మెరుగ్గా ఉంది.తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ ఆటల్లో డీజేలు, దాండియా వచ్చి చేరినవి. తెలంగాణ జీవితం ఉట్టిపడే ఈ పండుగకు పూర్వకళ తీసుకురావడానికి ఎలాంటి ప్రణాళికలు వేసుకున్నారు?బతుకమ్మ పాటలు ఏ కర్తృత్వం లేకుండా, మౌఖికంగా తరం నుండి తరానికి వస్తున్న సాంస్కృతిక సంపద. ఇవి ఒకప్పటి కుటుంబ సంబంధాలకు, ఆ సామాజిక స్థితికి అద్దం పడతాయి. అయితే మొదటి నుండి తెలంగాణాలో ఎగిసిపడిన ఉద్యమాల ప్రభావాలకు బతుకమ్మ పండుగ కూడా లోనయ్యింది. ఇక ముందు ఎలాంటి కృత్రిమత్వం లేకుండా, సహజసిద్ధంగా ఈ పండుగ కొనసాగించే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు కూడా ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించారు. ఈ సారి బతుకమ్మ ఆటలో ఈశ్వరమ్మ అనే ఒక ఆవిడతో బతుకమ్మ పాటలు పాడించాము. ఇకపై బతుకమ్మ సంబరాల్లో భౌతికంగా ఆడే పాడే సాంప్రదాయమే కొనసాగుతుంది తప్ప రికార్డింగ్‌లు, డీజేలు ఉండవు.ఆదివాసీల కళారూపాలు, జానపదకళలు మొదలుకొని తెలంగాణ నాటకం వరకు మీ కార్యాచరణ ఎలా ఉండబోతున్నది? సినిమా విషయంలో గతంలో ఉన్న ప్రోత్సాహం ఎలా ఏవిధంగా కొనసాగబోతున్నది?కోయ, గుస్సాడి, లంబాడి లాంటి ఆదివాసి కళారూపాలుబీ ఒగ్గుడోలు, బహు రూపులు, పగటి వేషాలు, చిరుతలు, కోలాటం లాంటి జానపద కళారూపాల ప్రదర్శనకు వివిధ సందర్భాలలో అవకాశం దొరుకుతున్నది. ఇదివరకు ఇలాంటి కళా ప్రదర్శనలు చూడని నగర ప్రజలు కూడా వీటిని చూసే అవకాశాలు కలుగుతున్నాయి. ఆధునిక కాలం తీసుకువచ్చిన వేగం వల్ల ఒక్క సినిమాలే గాక టీవీలు, యూట్యూబ్ చానళ్లు, ఇతర మీడియా విస్తరించడంతో ఒక ప్రదర్శన రూపంగా నాటకం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఇది తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన సమస్య కాదు. అయినప్పటికీ వరంగల్, నల్గొండ, ఖమ్మం, హైదరాబాదులో అనేక నాటక సమాజాలు ఉన్నాయి. అవి ప్రదర్శనలు కూడా చేస్తున్నాయి. ఇప్పటికీ పౌరాణిక నాటకాలు కూడా తెలంగాణలో ప్రదర్శించబడుతూనే ఉన్నాయి. రవీంద్రభారతిలో నాటకాలు, జానపద కళలు, ఆదివాసి కళారూపాలు సందర్భానుసారంగా ప్రదర్శించబడుతున్నాయి. సినిమా రంగానికి ప్రోత్సాహం కొనసాగుతుంది. తెలంగాణ భాషలో సంస్కృతిని ప్రతిబింబించే సినిమాలకు ఆదరణ లభిస్తుంది. ప్రభుత్వం గద్దర్ అవార్డులను కూడా బహూకరిస్తూ ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే.భాషా సాంస్కృతిక శాఖ తరఫున సాహిత్య రంగం విషయంలో మీ దృష్టిలో ఎలాంటి కొత్త ఆలోచనలు, ప్రతిపాదనలు ఉన్నాయి?సాహిత్యంలో కృషి చేయడానికి తెలంగాణ సాహిత్య అకాడమీ, సంగీతంలోనూ నాటకంలోనూ కృషి చేయడానికి తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఉన్నాయి. ఈ రెండు సంస్థలతో సమన్వయంతో పని చేస్తూ సాహిత్యాన్ని సంగీత నాటకాలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రణాళిక ఉంది. గతంలో సాహిత్య అకాడమీ తరఫున 'కావ్య పరిమళం', 'నవలా స్రవంతి' అనే రెండు కార్యక్రమాల ద్వారా తెలంగాణ కావ్యాలను, నవలలను విస్తృతంగా పరిచయం చేసి యూట్యూబ్‌లో స్థిరపరిచాం. పుస్తకాలుగా కూడా ప్రచురించాం. ఈ దిశగా భారతీయ సాహిత్య వైవిధ్యాన్ని తెలంగాణ పాఠకులకు తెలియజేయడానికి ఒక్కో భాషకు సంబంధించిన ప్రాతినిధ్య కావ్యాన్ని లేదా గ్రంథాన్ని పరిచయం చేసే ఆలోచన ఉంది.

# అర్ధాంతరంగా ఆగిన రైతుబజార్ నిర్మాణం



దర్శి, అక్టోబరు 7(టుడే విదుర): రైతుల ప్రయోజనం కోసం మార్కెటింగ్ శాఖ నిధులతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రైతుబజార్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఏళ్ల తరబడి మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. వైసీపీ పాలకుల అసమర్థతతో దర్శి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పథకాలు మూలనపడిన విషయం తెలిసిందే. రైతుబజారు కూడా గోడల స్టేజీలో నిలిచిపోయింది.గత ప్రభుత్వం హయాంలో రూ.60 లక్షలతో 40 షాపులు నిర్మించే విధంగా నిర్మాణం చేపట్టారు. ఒక కాంట్రాక్టర్ టెండర్ ద్వారా పనులు దక్కించుకోగా, మరో వైసీపీ నాయకుడు ఆ పనిని సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. అరకొరగా పనులు చేసి బిల్లులు చేసుకోవచ్చనే ఉద్దే?శంతో కొంతమేర పనులు చేశాడు. అధికారులపై ఒత్తిడి తెచ్చి రూ.25 లక్షలకు పార్టు బిల్లును తయారుచేయించి పంపారు. అప్పటికే వైసీపీ ప్రభుత్వం నిధులను పక్కదారి మళ్లించటంతో పార్టు బిల్లు నిధులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. వైసీపీ ప్రభుత్వంలో అలాగే నిలిచిపోయింది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టు బిల్లు కోసం ప్రయత్నించారు. నాసిరకంగా పనులు చేశారనే విమర్శలు రావటంతో అధికారులు బిల్లు మంజూరు చేయలేదు. ఇప్పటికీ రైతుబజార్ నిర్మాణం అలాగే మధ్యలో నిలిచిపోయింది. పునాదులు కూడా సక్రమంగా వేయకపోవటంతో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపునీరు రైతు బజార్ నిర్మాణం చుట్టూ చేరింది. రోజులు తరబడి పునాదుల చుట్టూ నీరు నిల్వ ఉండటంతో దెబ్బతినే ప్రమాదం నెలకొంది. సంబంధిత అధికారులు రైతుబజార్ నిర్మాణం గురించి పట్టించుకోలేదు. నిల్వఉన్న నీటిని కూడా పక్కకు మళ్లించే ప్రయత్నం చేయలేదు. దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో అనేకమంది రైతులు పండ్లు, పూలు, కూరగాయలు పండిస్తారు. వారు పండించిన పంటలను రైతుబజార్‌లో గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు ప్రారంభించిన రైతుబజార్ మధ్యలో నిలిచిపోవటంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలను గుర్తించి కూటమి ప్రభుత్వం నిలిచిన రైతుబజార్ నిర్మాణం పూర్తిచేసి, అక్కడ మార్కెట్ ఏర్పాటుకు వసరులు కల్పించాలని కోరుతున్నారు.

# వలస కార్మికులు విలవిల



చీమకుర్తి, అక్టోబరు 7(టుడే విదుర): గనుల సీనరేజీ వసూలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు చేపట్టిన నిరవధిక సమ్మె వలస కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఐదురోజుల నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పొట్ట చేతపట్టుకొని ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చిన వారికి పూట గడవని దుస్థితి నెలకొంది. చీమకుర్తి, రామతీర్థం, మర్రిచెట్లపాలెం, బూదవాడ పరిసర ప్రాంతాల్లో దాదాపు 800 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు పది వేల మందికిపైగా వలస కార్మికులు, మరో పది వేల మంది ఇతర కార్మికులు పనిచేస్తున్నారు. వలస కార్మికులంతా కాంట్రాక్ట్ పద్ధతిపై వచ్చిన వారు కావడంతో రాయి కటింగ్ చేసిన మేరకు మాత్రమే వారికి వేతనం అందుతుంది. ఈ పరిస్థితుల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు తమ ఫ్యాక్టరీలను షట్‌డౌన్ చేశారు. దీంతో వలస కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వీరిలో రాజస్థాన్, ఒడిసా, జార?ండ్, బిహార్ తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఎక్కువగా ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన కార్మికుల్లో చాలా మంది ఇక్కడ నెలకొన్న క్లిష్ట పరిస్థితులను గమనించి తిరుగుముఖం పట్టారు. మిగతా వారు తమ పరిస్థితి ఏమిటని బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. గత కరోనా కాలంలో ఫ్యాక్టరీలు మూతపడిన సమయంలో భారీ స్థాయిలో వలస కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఫ్యాక్టరీ ఓనర్లు సైతం ఆందోళన చెందుతున్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని..

## దళితుల అర్ధనగ్న నిరసన

పుత్తూరు టౌన్ (చిత్తూరు) :అక్టోబరు 7(టుడే విదుర): వెదురుకుప్పం మండలం బొమ్మేపల్లి పంచాయతీ దేవలంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పుత్తూరు మండలం తడుకు పంచాయతీలోని ఎగువ గూళూరు దళితులు అర్ధనగ్నంగా నిరసన చేశారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి



వై.నందయ్య మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం దేవళంపేట నందు ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్నం, దళితల ఆశాజ్యోతి, భారత దేశానికి మార్గ దర్శకులు, ప్రథమ న్యాయశాఖ మంత్రి, మానవతావాది అయిన డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం, భారత దేశానికి మాయని మచ్చని ప్రజాస్వామ్యనికి గొడ్డలి పెట్టు అని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిందితులను గుర్తించి, వెంటనే శిక్షించాలని భారతదేశంలోని అంబేద్కర్ విగ్రహాలను సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఈ సంఘటన పైన పూర్తిగా దర్యాప్తు చేసి న్యాయం చేస్తారనే ఆశాభావాన్ని దళితులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దళితలు టి.రవి భూపాల్, వై.కేశవులు, వి.శివయ్య, వి.గోపాల్, కె.కఅష్ణ, టి.తులసి బాబు, వి.నాగార్జున, కె.కార్తవరాయన్, టి.గిరి బాబు, వి.శివ, తదితరులు పాల్గొన్నారు.

# అంతుచిక్కని వ్యాధితో తురకపాలెంలో మరో మహిళ మృతి



గుంటూరు జిల్లా ప్రతినిధి :అక్టోబరు 7(టుడే విదుర): అంతుచిక్కని వ్యాధితో మరణాలు సంభవిస్తున్న గుంటూరు జిల్లా తురకపాలెంలో మరొక మహిళ మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు స్థానిక బిసి కాలనీకి చెందిన చల్లా కృష్ణవేణి (24) గత పది రోజుగా జ్వరంతో బాధపడుతూ గుంటూరు, మంగళగిరి, విజయవాడలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రెండ్రోజుల క్రితం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చేరారు. మధ్యాహ్నం పరిస్థితి విషమించి ఆమె మృతి చెందారు. జ్వరంతో పాటు వంటిపై గడ్డలు ఏర్పడ్డాయని, చికిత్స కోసం ప్రైవేట్ హాస్పిటల్స్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు షుగర్ వ్యాధి ఉందని ఆస్పత్రి వైద్యులు కె షీట్‌లో నమోదు చేశారు. మెలోడిసిస్ వ్యాధి కారణంగానే మృతి చెంది ఉండవచ్చని తొలుత భావించినా, షుగర్ వ్యాధి వల్ల ఆమె మృతి చెందినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. 24 ఏళ్లకే షుగర్ వ్యాధితో మృతి చెందడం సంచలనంగా మారింది. మరోవైపు తురకపాలెంలో జులై 1 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 22 మంది మృతి చెందినట్టు ప్రభుత్వం గుర్తించింది. కానీ, వారి మృతికి ఇంత వరకు స్పష్టమైన కారణాలను అధికారులు వెల్లడించలేకపోయారు. తాగు నీటిలో కాలుష్యం ఉందని, అందువల్ల యురేనియం నిక్షేపాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.

# నకిలీ మద్యం తయారీ కేసులో మరో ముగ్గురు అరెస్టు

అక్టోబరు 7(టుడే విదుర): ములకలచెరువు (అన్నమయ్య జిల్లా)నకిలీ మద్యం తయారీ కేసులో మరో ముగ్గురు బెల్ట్ షాపుల నిర్వాహకులను వేర్వేరుగా ఎక్సైజ్ పోలీసులు, ములకలచెరువు ఎస్ఐ నరసింహుడు అరెస్టు చేశారు. దీంతో, అరెస్టయిన వారి సంఖ్య 13కు చేరుకుంది. ఆదినారాయణ, వెంకట రమణ, పాల రాములను పోలీసులు అరెస్టు చేశారు. ములకలచెరువులో నకిలీ మద్యం గుట్టురట్టు కావడంతో బెల్ట్ షాపులు నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పదిమందిని అరెస్టు చేశారు. ఈ కేసులో తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డికి సన్నిహితుడైన జనార్ధన్‌రావును ఎ-1గా, జయచంద్రారెడ్డి పిఎ రాజేష్‌ను ఎ-5గా చేర్చారు. రెండో రోజూ ఎక్సైజ్ పోలీసులు, ఎస్ఐ ముమ్మరంగా మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిటిఎం మండలం మల్లెలకు చెందిన ఆదినారాయణను అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పులికల్లు సమీపంలోని కమ్మవారిపల్లె వద్ద దానిమ్మతోటలో వెంకటరమణను అరెస్టు చేశారు. ఆయన నుంచి మూడు బాక్సుల బీరు బాటిళ్లు, 27 నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పాతకోటలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పాలు రామును ములకలచెరువు ఎస్ఐ అరెస్టు చేశారు. ఆయన వద్ద 76 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 103 మద్యం బాటిళ్లు, మూడు బాక్సుల బీరు బాటిళ్లను స్వాధీనం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నియోజకవర్గంలోని మద్యం దుకాణాలతోపాటు బెల్ట్ షాపుల్లో కూడా నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ పోలీసులు బృందాలుగా ఏర్పడి నియోజకవర్గ వ్యాప్తంగా బెల్టు షాపులపై దాడులు నిర్వహిస్తున్నారు.



# మళ్లీ.. విషపు ఈగలు

## రెండేళ్ల తర్వాత చెట్లపై గూళ్లు కడుతున్న వైనం
## గతంలో ఈగలు కుట్టి ఇద్దరు మృతి
## బెంబేలెత్తిపోతున్న తీర గ్రామాలు



నరసాపురం, అక్టోబరు 7(టుడే విదుర) : చూడ్డానికి తేనెటీగలానే ఉంటుంది. తేనెటీగలానే ఈ.. ఈగ కుడితే కూడా భరించలేని నొప్పితో విలవిల్లాడిపోవడం ఖాయం. కొద్దిసేపటికి కళ్లు తిరగడం, సొమ్మసిల్లిపడిపోవడం వంటివి చకచకా జరిగిపోతాయి. సకాలంలో వైద్యం అందకపోతే ప్రాణాలు కూడా పోతాయి. ఇంతటి ప్రమాదకరమైన విషపు ఈగలు మళ్లీ తీర ప్రాంతానికి వచ్చేశాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లోని తాటి, కొబ్బరి చెట్లు, కొన్ని తోటల్లోని మామిడిచెట్లపై ఇలాంటి ఈగల పుట్ట(గూళ్లు)లు దర్శనమిస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఒంటరిగా తోటలు, సముద్ర ఒడ్డుకు వెళ్లేందుకు సాహసించడం లేదు. ప్రస్తుతం ఈ రెండు మండలాల్లో రెండు చోట్ల గూళ్లను గుర్తించారు. రెండేళ్ల క్రితం నరసాపురం మండలం గొంది గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న ఇద్దరు కార్మికుల్ని విషపు ఈగలు కుట్టాయి. వారిలో ఒకరు చికిత్స పొందుతూ పాలకొల్లు ఆస్పత్రిలో మృతి చెందగా మరొకరు భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. గతంలో వేములదీవి గ్రామంలోనూ ఇలాగే వీటిబారినపడి ఓవ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కేపీపాలెం గ్రామంలో మరో వ్యక్తికి సకాలంలో వైద్యం పొంది ప్రాణాలతో బయటపడ్డాడు.

ఒక పుట్టతో.. నెలలో రెండు మూడు!

ఏదో ఒకటి రెండు చోట్ల ఈగల గూళ్లు ఉన్నాయని వదిలేస్తే.. వీటి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. గూళ్లు కట్టి వాటిల్లో పిల్లల్ని పెట్టడం సర్వసాధారణం. అలా విస్తరించుకుంటూ వెళతాయి. ఎక్కువగా తోటలు, సముద్ర తీర ప్రాంతంలోని తాటి, ఈత చెట్లపైనే గూళ్లు కడతాయి. పదేళ్ల క్రితం ఓఎన్‌జీసీ సహకారంలో అప్పటి అధికారులు వీటిని సామూహికంగా నిర్మూలించారు. శాస్త్రవేత్తలు, వైద్యుల సూచనలు పాటించి ముందుగా చెట్లపై ఉన్న గూళ్లపై మత్తుతో కూడిన మందులు చల్లారు. ఆ తరువాత మంటలు పెట్టి దహనం చేశారు. కొంత కాలం వరకు వీటి జాడ లేదు. మళ్లీ రెండేళ్ల క్రితం దర్శనమిచ్చాయి. కొన్ని చోట్ల ఇదే పద్ధతిలో నిర్మూలించారు. మళ్లీ ఇవి కనిపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

# ఉత్సాహంగా ఎపి చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలు



సత్తెనపల్లి (పల్నాడు) :అక్టోబరు 7(టుడే విదుర): పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన మహా సభలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ మహాసభకు రాష్ట్ర నలుమూలల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభల ప్రారంభం సందర్భంగా చేనేత కార్మిక సంఘం జెండాను ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు అనంత పిచ్చయ్య ఆవిష్కరించారు. ఈ మహాసభల సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలో చేనేత కార్మికుల భారీ ప్రదర్శన నిర్వహించారు. చేనేత కార్మికుల ప్రదర్శనలో చిన్నారులు కోలాటం వేసి చూపరులను అలరించారు.

# డీఎస్సీ అభ్యర్థుల నిరసన




అమరావతి, అక్టోబరు 7(టుడే విదుర): "డీఎస్సీ-2025 ఉత్తీర్ణులైన మమ్మల్ని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. కానీ, ఉద్యోగాలు మాత్రం ఇవ్వలేదు" అని పలువురు డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి సచివాలయం గేటు బయట వారంతా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఒక ఉద్యోగానికి.. ఒక అభ్యర్థి (1:1) విధానంలో తమను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారని.. ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాల్ లెటర్లు పంపిన తర్వాత సెలక్షన్ లిస్టులో తమ పేర్లు లేవని, రోస్టర్ పాయింట్ల పేరుతో అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఆరోపించారు. మంత్రి లోకేశ్ తమకు న్యాయం చేయాలని కోరుతున్నామని చెప్పారు.

# ఐవీఎఫ్ పద్ధతిలో కోడెదూడ జననం



మచిలీపట్నం/కూచిపూడి, అక్టోబరు 7(టుడే విదుర): ఇన్ వి ట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతిలో పశుసంవర్ధక శాఖ అధికారులు కృష్ణా జిల్లాలో తొలిసారిగా చేసిన ప్రయోగం ఫలించింది. ప్రయోగశాలలో ఫలదీకరణం చేయించిన పిండాన్ని దేశీయ ఆవు గర్భంలో ప్రవేశపెట్టగా.. ఆ పిండం పెద్దదై తొమ్మిది నెలల ఐదు రోజులకు కోడెదూడ రూపంలో జన్మించింది. గుంటూరు లాంఫాం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ముత్తారావు, పశుగణాభివృద్ధి విభాగ వైద్యుడు శ్రీమన్నారాయణ, ఎన్ఆర్ శ్రీకాంత్, పశుసంవర్ధక శాఖ ఏడీ నాగభూషణం, మొవ్వ మండలం భట్లపెనుమర్రు పశువైద్యాధికారి బి.విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ ఐవీఎఫ్ పద్ధతికి శ్రీకారం చుట్టారు. గుంటూరు లాంఫాంలో మేలురకానికి చెందిన గిర్ జాతి ఆవు నుంచి అండాలు, ఒంగోలు జాతి ఆబోతు నుంచి వీర్యాన్ని సేకరించి ఫలదీకరణం చెందించారు. ఈ పిండాన్ని కృష్ణా జిల్లా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలోని జొన్నలగడ్డ హనుమకుమార్‌కు చెందిన ఆవు ఎదకు వచ్చిన ఏడో రోజున గర్భంలో ప్రవేశపెట్టారు. ఈ పిండం పెరిగి పెద్దదవడంతో ఈ ఆవు కోడెదూడకు జన్మనిచ్చింది. మామూలు పద్ధతిలో ఒక ఆవు తన జీవితకాలంలో 8 నుంచి 10 పిల్లలకు జన్మనిస్తుందని, అయితే జన్యుపరమైన పద్ధతి ద్వారా ఒక ఆవు నుంచి సేకరించిన అండాలను 150 పిండాలుగా జన్యుమార్పిడి చేసి, వాటిని ఇతర ఆవుల గర్భంలో ప్రవేశపెట్టి 50 నుంచి 60 దూడలను పొందవచ్చని పశుసంవర్ధకశాఖ ఏడీ నాగభూషణం, భట్లపెనుమర్రు పశువైద్యాధికారి విజయకుమార్ తెలిపారు. ఇలా పుట్టిన ఆవుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఐవీఎఫ్ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా దేశీయ ఆవు జాతులను మరింతగా ఉత్పత్తి చేసేందుకు ఈ ప్రయోగం చేసి సఫలీకృతులమైనట్లు పేర్కొన్నారు. ఐవీఎఫ్ పద్ధతిలో ఆవు దూడలు మాత్రమే పుట్టేలా చేస్తున్న ప్రయోగాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కృష్ణా జిల్లాలో తొలిసారిగా చేపట్టిన

# అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి




విశాఖపట్నం :అక్టోబరు 7(టుడే విదుర): పెదగంట్యాడలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని భావిస్తున్న అదానీ సంస్థ (అనుబంధ కంపెనీ అయిన అంబుజా సిమెంట్స్ లిమిటెడ్ పేరుతో పెడుతున్నారు). ఈ ఫ్యాక్టరీ రూపొందించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో అన్నీ అవాస్తవాలే పేర్కొంది. అడ్డగోలుగా అనుమతులు పొందేందుకు తప్పుడు సమాచారం ఇచ్చిందని ప్రజా సంఘాల నేతలు మండిపడ్డారు. సిమెంట్ పరిశ్రమలు నివాస ప్రాంతాలకు 500 మీటర్ల అవతల ఉండాలని పర్యావరణ నిబంధనలు చెప్తున్నాయి. కానీ నిర్మించ తలపెట్టిన అంబుజా సిమెంట్ కంపెనీకి 130 మీటర్ల దూరంలోపే పెదగంట్యాడలో ఇళ్లు ఉన్నాయని, గాజువాకలో 290 మీటర్ల లోపే ఇల్లు ఉన్నాయనే వాస్తవాన్ని ఆ నివేదిక కప్పిపుచిందని, ఈ ఫ్యాక్టరీ నడవడానికి 4 వేల కిలోలీటర్ల నీరు అవసరం అవుతుందని పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక తెలియజేస్తుందన్నారు. అక్కడకు 4 కిమీల దూరంలో ఉన్న డీశాలినేషన్ ప్లాంటు నుండి నీరు తీసుకుంటామని లేని ప్లాంట్ ఉన్నట్లుగా అబద్దాలు వ్రాసారని, ఇప్పటికే ఈ ప్రాంతమంతా పరిమితికి మించిన కాలుష్యంతో నిండిపోయి ఉందనే వాస్తవాలను మరుగున పెట్టిందని పేర్కొన్నారు. అనేక విషతుల్య రసాయనాలు వెదజల్లే అవకాశం ఉన్న ఆ ప్లాంట్ కారణంగా ఆ ప్రాంత ప్రజలందరికీ క్యాన్సర్ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మవ్యాధులు తదితర అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందనే విషయాన్ని కూడా ఆ నివేదిక మభ్య పెట్టిందని ప్రజా సంఘాలు ఆరోపించాయి. ఈ విషయాలన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఈ పర్యావరణ ప్రభావ నివేదికను తిరస్కరించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి కనీసం నోరు మెదపడం లేదని ప్రజాసంఘాలు ఆరోపించాయి.

# రాష్ట్రంలో 30 పత్తి కొనుగోలు కేంద్రాలు

## ఏర్పాటుకు చర్యలు చేపట్టిన సీసీఐ
## సీసీఐ, జిన్నర్ల మధ్య కుదిరిన సయోధ్య



గుంటూరు సిటీ, అక్టోబరు 7(టుడే విదుర): రాష్ట్రవ్యాప్తంగా 30 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిన్నర్ల నుంచి తాజాగా మరోమారు టెండర్లు ఆహ్వానించింది. అక్టోబరు 10న టెండర్లు దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించింది. గత రెండు నెలలుగా సీసీఐ, జిన్నర్లకు (పత్తి మిల్లుల యజమానులు) మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోవడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. వ్యవసాయ మంత్రి అచ్చెనాయుడు సూచనతో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత సీసీఐ, జిన్నర్ల మధ్య ఏర్పడిన వివాద పరిష్కారానికి తీవ్రంగా ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. హైదరాబాద్‌కు వచ్చిన సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాతో ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్, కార్యదర్శి హెచ్.వెంకట్రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి మన్నవ హరినాథ్ బాబు మరోసారి వర్చువల్‌గా కూడా చర్చలు జరిపారు. ఆయన హామీతో సంతృప్తి చెందిన జిన్నర్లు టెండర్ల ప్రక్రియలో పాల్గొనాలని నిశ్చయించుకున్నారు. కొందరు టెండర్లు దాఖలు చేసినట్లు సమాచారం.

సీఎం యాప్ ద్వారానే కొనుగోళ్లు చేయాలి

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో ఇప్పటివరకు సీఎం యాప్ వినియోగిస్తున్నారు. ఈ యాప్ అందుబాటులోకొచ్చిన తర్వాత కొనుగోలు వ్యవహారంలో దళారులు, వ్యాపారులకు అడ్డుకట్ట పడింది. అయితే ఈ ఏడాది నుంచి అన్ని రాష్ట్రాల్లో కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తామని సీసీఐ టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. రైతులు మాత్రం సీఎం యాప్ ద్వారా కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 మధ్య మాత్రమే ఉండాలని సీసీఐ విధించిన నిబంధన కూడా రైతులకు నష్టం కలిగించేదేనని అంటున్నారు.

# రాష్ట్రంలో కల్తీ దగ్గు మందు లేదు




అమరావతి/గుంటూరు వైద్యం, అక్టోబరు 7(టుడే విదుర): మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 12 మంది చిన్నారుల మృతికి కారణమైన కల్తీ దగ్గు మందు కోల్డ్రిఫ్ జాడ రాష్ట్రంలో లేదని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఔషధ దుకాణాలకు కానీ, ప్రభుత్వాసుపత్రులకు కానీ ఆ దగ్గు మందు సరఫరా చేయలేదని చెప్పారు. అందువల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండేళ్లలోపు చిన్నారులకు దగ్గు, జలుబుకు సంబంధించి ద్రవరూపంలో మందులు సూచించకుండా వైద్యులకు ఆదేశాలు పంపాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఔషధ దుకాణాల్లో కోల్డ్రిఫ్ మందు ఎక్కడా లేదని ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, డ్రగ్స్ డీజీ గిరీషా మంత్రికి తెలిపారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు జరిపారు.

# స్ట్రాబెర్రీ సాగుపై ఆసక్తి



చింతపల్లి, అక్టోబరు 7(టుడే విదుర): గిరిజన గ్రామాల్లో విదేశీ ఉద్యాన పంటలను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటలైన స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో దిగుబడులు, ఆదాయం ఆశాజనకంగా ఉండడంతో ఈ పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వీటి సాగును ప్రోత్సహిస్తోంది. దీంతో గిరిజన ప్రాంతాల్లో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అరకులోయ, లంబసింగి పరిసర ప్రాంతాల్లో 50 ఎకరాల్లో స్ట్రాబెర్రీ, ఎనిమిది ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తూ రైతులు ఆదాయాన్ని పొందుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా గిరిజన రైతులకు అవకాడో, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడంతో రైతులు నాట్లు వేసుకున్నారు. ఈ పంటల నుంచి దిగుబడులు మరో రెండేళ్ల వస్తాయి.

స్ట్రాబెర్రీ సాగుకు అనుకూలం

అరకులోయ, లంబసింగి ప్రాంతాల్లో గిరిజన రైతులు స్ట్రాబెర్రీని సాగు చేస్తున్నారు. ఇరవై ఏళ్ల క్రితం చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు స్ట్రాబెర్రీ సాగుకు గిరిజన ప్రాంతం అత్యంత అనుకూలమని నిర్ధారించారు. శాస్త్రవేత్తల సహకారంతో 2008లో చింతపల్లి మండలం గొందిపాకలు గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు బౌడు కుశలవుడు తొలిసారిగా స్ట్రాబెర్రీని సాగు చేపట్టాడు. తొలి ఏడాది నష్టపోయినప్పటికీ మరుసటి ఏడాది నుంచి లాభాలు సాధించాడు. కుశలవుడును స్ఫూర్తిగా తీసుకొని కొంత మంది మైదాన ప్రాంత రైతులు గిరిజన ప్రాంతంలో భూమిని లీజుకు తీసుకొని సాగు చేపట్టారు. దిగుబడులు ఆశించిన దానికంటే అధికంగా వస్తుండడంతో గత ఎనిమిదేళ్లుగా లంబసింగి, అరకులోయ ప్రాంతాల్లో గిరిజన రైతులు స్ట్రాబెర్రీ సాగు చేపడుతున్నారు. దిగుబడులు నవంబరు నుంచి జనవరి వరకు వస్తున్నాయి. అధిక శాతం స్ట్రాబెర్రీలను పర్యాటకులు కొనుగోలు చేస్తున్నారు. తక్కువ పరిమాణంలో స్ట్రాబెర్రీలను మైదాన ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్రాంతీయ మార్కెట్‌లో 200 గ్రాముల స్ట్రాబెర్రీలు రూ.60 నుంచి రూ.80లకు విక్రయిస్తున్నారు.

# పోలీసులపై దాడి



**రాళ్లదాడిలో ధ్వంసమైన పోలీస్ కారు అద్దం**
**%పోలీసులపై దాడి**
**జమ్ములో ఆదివారం రాత్రి ఉత్కంఠ**
**రాళ్లు, చెప్పులు విసిరిన వైనం**
**25 మందిపై కేసు**

గుర్ల, అక్టోబరు 7(టుడే విదుర): గుర్ల మండలంలోని జమ్ము గ్రామంలో రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొందరు స్థానికులు పోలీసులను భయపెట్టారు. రాళ్లు, చెప్పులు విసురుతూ మూకుమ్మడిగా దాడికి దిగారు. దీంతో పోలీసులు ఏం చేయలేక సీఆర్‌పీఎఫ్ ఫోర్స్‌కు సమాచారం ఇచ్చారు. నిమిషాల్లో పోలీసులను రక్షించేందుకు ప్రత్యేక దళాలు రంగప్రవేశం చేశాయి. వివరాల్లోకి వెళితే.. దేవి నిమజ్జనం సందర్భంగా జమ్ముగ్రామంలో రాత్రి గొడవ జరిగింది. ఈ విషయం తెలిసి గ్రామానికి చేరుకున్న పోలీసుల పట్ల స్థానికులు కొందరు దురుసుగా ప్రవర్తించారు. దాడికి ప్రయత్నించారు. నిందితులను గుర్తించిన పోలీసులు విచారించేందుకు రాత్రి మరోసారి గ్రామానికి వెళ్లగా మళ్లీ దాడి చేశారు. సర్పంచ్ నరసింహమూర్తి ఇంటికి వెళ్లిన పోలీసులు నిందితులను రమ్మని కోరారు. అంతలో మహిళలు, కొంతమంది యువకులు కర్రలు, రాళ్లతో దాడికి దిగారు. పోలీస్ వాహనాలను రాళ్లతో కొట్టారు. దీంతో కానిస్టేబుళ్లతో పాటు సీఐకు దెబ్బలు తగిలాయి. పరిస్థితి అదుపు తప్పడంతో వారు సీఆర్‌పీఎఫ్ బలగాలకు సమాచారం ఇచ్చారు. నిమిషాల్లో అక్కడికి చేరుకున్న దళాలు 25 మందిని గుర్తించి వారిని స్టేషన్‌కు తరలించాయి. వారందరిపై ఎస్‌ఐ నారాయణరావు కేసు నమోదు చేశారు.

ఎంతటివారైనా ఉపేక్షించం: ఎస్పీ

శాంతిభద్రతల పరిరక్షణలో ఉండే పోలీసు విధులను, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. జమ్ము గ్రామంలో అర్ధరాత్రి కొంత మంది వ్యక్తులు దాడులకు పాల్పడడం, పోలీసు వాహనాలపై రాళ్లు రువ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడుల్లో ఎంత మంది ప్రమేయం ఉన్నా, ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టంచేశారు.

తిరుగుబాటును సహించేది లేదు: చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు

రాజ్యాంగ వ్యవస్థలపై తిరుగుబాటు చేస్తే సహించేదిలేదని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. సోమవారం గుర్ల పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గొడవకు కారణమైన వారిని, పోలీసులపై తిరగబడ్డ వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నామన్నారు. ఇప్పటికే సర్పంచ్‌తో పాటు మరో 24 మందిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీసులపై దాడిచేస్తే ఎంతటివారినైనా వదలిపెట్టేది లేదన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నారాయణరావు ఉన్నారు.

# రోగులకు నాణ్యమైన సేవలు అందించండి



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 7(టుడే విదుర): రోగులకు నాణ్యమైన సేవలు అందించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ తెలిపారు. కర్నూలు సర్వజన వైద్యశాలను డీఎంఈ సందర్శించారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహిం చారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, పరిశుభ్రత, రోగుల పట్ల సేవభావం కలిగి ఉండాలని డీఎంఈ ఆదేశించారు. అనంతరం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్, నర్సింగ్ స్కూల్‌ను పరిశీలించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డీఎంఈ ఆరా తీశారు. వైద్యసిబ్బందితో మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో రాజీ ఉండకూడదన్నారు. చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులతో మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను విస్తృతంగా ఉపయో గించి సేవల నాణ్యతను పెంచాలని సూచించారు.కాలేజ్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్ వసతులను డీఎంఈ పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో ఉన్న నర్సింగ్ స్కూల్ భవనాన్ని డీఎంఈ పరిశీలించారు. కొత్త భవనానికి సం బంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి దీనిపై ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో చర్చించారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్స్, వైద్యులు పాల్గొన్నారు.

# భూ సేకరణపై రైతుల ఆగ్రహం




హిందూపురం అక్టోబరు 7(టుడే విదుర): పరిశ్రమల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా భూ సేకరణకు సిద్ధం కావడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండానే సాగు భూములను లాక్కోవాలని చూస్తూ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేయాలని చూస్తోందంటూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీనిపై అధికారులను ప్రశ్నించారు. రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం మలగూరు, నందమూరి నగర్, నీరుకుంటపల్లి, రాచేపల్లి, చలివెందుల, లేపాక్షి మండలం కొండూరు, సోమందేపల్లి మండలం నడింపల్లి గ్రామాల పరిధిలో దాదాపు 1,118 మంది రైతులకు చెందిన 2,191 ఎకరాల భూములను భూ సేకరణ చట్టం ద్వారా లాక్కోవడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా మలగూరు సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల ఆవరణలో రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. పైగ్రామాల రైతులందరూ తమ పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంకు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డుల జెరాక్స్ కాపీలు ఇవ్వాలని అధికారులు చెప్పారు. ఎందుకోసం భూములు సేకరిస్తున్నారు? ఎంత భూమి సేకరిస్తున్నారు? ఎకరాకు ఎంత పరిహారం ఇస్తారు? తదితర వివరాలను రైతులు అడిగినా అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. పరిశ్రమల కోసం భూములను సేకరించాలని ప్రభుత్వం చెప్పిందని, అందులో భాగంగా ఇక్కడికి వచ్చామని వారు సమాధానం ఇచ్చారు. ఏ పరిశ్రమ ఏర్పాటు చేస్తారో తెలియకుండా భూముల సేకరణకు ఎందుకొచ్చారంటూ అధికారులను రైతులు నిలదీశారు. పూర్తి వివరాలు తెలియజేయకుండా తమ భూములు ఎలా తీసుకుంటారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూములను పరిశ్రమల కోసం తీసుకుంటున్నారా? లేదా అంబాని, అదానిలకు కట్టబెట్టడానికి తీసుకుంటున్నారా? అని నిలదీశారు. తమ భూములు ఇచ్చేది లేదంటూ తేల్చి చెప్పారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి హిందూపురం–గోరంట్ల రహదారిపై బైఠాయించారు. భూ సేకరణకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సాగు భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని, కుటుంబ జీవనాధారమైన సాగు భూములను తమ ప్రాణాలు అడ్డుపెట్టేనా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. దీంతో, అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధారెడ్డి, టిడిపి నాయకులు చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కంచరపాలెంలో దోపిడీ



విశాఖపట్నం/కంచరపాలెం, అక్టోబరు 7(టుడే విదుర): నగరంలోని కంచరపాలెం ఇందిరానగర్‌లో భారీ దోపిడీ జరిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి వెనుక వైపు నుంచి లోనికి ప్రవేశించిన దుండగులు నిద్రిస్తున్న వృద్ధురాలితోపాటు ఆమె మనుమడిని బంధించి ఇంట్లో ఉన్న 12 తులాల బంగారం, రూ.3 లక్షల నగదుతో పాటు కారును అపహరించుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.రెడ్డికంచరపాలెం ఇందిరానగర్–5లో జాతీయ రహదారి పక్కన ధర్మాల ఆనందకుమార్‌రెడ్డికి రెండు అంతస్థుల ఇల్లు ఉంది. ఆనందకుమార్‌రెడ్డితోపాటు ఆయన తల్లి యల్లయ్యమ్మ (72), భార్య కోమలి, కుమారుడు కృష్ణకాంత్‌రెడ్డి (20) నివాసం ఉంటున్నారు. ఆనందరెడ్డి ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వెళ్లారు. రాత్రి పదిన్నర గంటల సమయంలో ఆనందకుమార్‌రెడ్డి భార్య కోమలి, కుమార్తె దేవికారెడ్డి నిద్రించేందుకు పైఅంతస్థులోకి వెళ్లిపోయారు. యల్లయ్యమ్మ కింద అంతస్థులోని బెడ్‌రూమ్‌లో నిద్రించగా, కృష్ణకాంత్‌రెడ్డి హాల్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు ధరించి ఇంటి వెనుక వైపు తలుపులు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు. అలికిడికి యల్లయ్యమ్మ లేవగా... ఆమె నోరు, చేతులకు దుండగులు ప్లాస్టిక్ టేపు వేసి బంధించారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని బలవంతంగా లాక్కొన్నారు. అనంతరం బీరువా తెరిచి అందులో మరికొంత బంగారం, రూ.మూడు లక్షలు నగదు తీసుకున్నారు. బీరువా తెరిచినప్పుడు శబ్దం రావడంతో హాల్‌లో నిద్రపోతున్న కృష్ణకాంత్‌రెడ్డి లేచి బెడ్‌రూమ్‌లోకి రాగా, అతడిని దుండగులు కొట్టి, నోటికి, చేతులకు ప్లాస్టిక్ టేపు వేసి బంధించారు. అతని చేతికి ఉన్న డైమండ్ రింగ్‌ను లాక్కొన్నారు. అనంతరం బెడ్‌రూమ్‌లోని టీవీ స్టాండ్‌పై ఉన్న కారు తాళాలను తీసుకుని కిందకు వెళ్లిపోయారు. ఇంటి ముందు పార్కు చేసి ఉన్న కారుతో దుండగులు వుడాయించారు. దీనిపై యల్లయ్యమ్మ కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసి దర్యాప్తు నిమిత్తం క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. దుండగులు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు వేసుకున్నారని, జీన్‌ప్యాంట్లు ధరించి ఉన్నారని, హిందీలో మాట్లాడారని యల్లయ్యమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# తీరానికి తాటి!



ఇచ్ఛాపురం, అక్టోబరు 7(టుడే విదుర): జిల్లాలో తీరప్రాంత రక్షణపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏటా విపత్తుల సమయంలో వందల కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తుంటాయి. ఆ సమయంలో ప్రజలకు అపారనష్టం కలుగుతోంది. దీనిని నియంత్రించేందకు తీరప్రాంతం పొడవునా తాటిచెట్లు పెంచాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలతోపాటు స్థానిక సంస్థల భాగస్వామ్యం చేయనుంది. జిల్లాలో 193 కిలోమీటర్ల తీరప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 25.12కిలోమీటర్ల తీరప్రాంతం రెడ్‌జోన్‌లో ఉన్నట్టు తేలింది. గతంలో తాటిచెట్లు ఉన్న ప్రాంతంలో విపత్తులు వచ్చినా పెద్దగా నష్టం జరగలేదు. అందుకే జిల్లాలోని 11 తీర మండలాల్లో తాటిచెట్లు పెంచాలని అటవీశాఖ నిర్ణయించింది. శ్రీకాకుళం డివిజన్‌లో 50వేలు, టెక్కలి, కాశీబుగ్గ డివిజన్లలో 25 వేల చొప్పున తాటి విత్తనాలను తీర ప్రాంతంలో నాటనుంది. కాశీబుగ్గ డివిజన్ పరిధిలో ట్రీ ఫౌండేషన్ తాటిచెట్ల విత్తనాలు నాటేందుకు, రక్షణ కల్పించేందుకు ముందుకు వచ్చింది. మిగతాచోట్ల సైతం స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసేందుకు అటవీ శాఖ ప్రయత్నిస్తోంది.జిల్లాలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ తీరప్రాంతం 193 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో వందలాది మత్స్యకార గ్రామాలున్నాయి. జిల్లాలోని బాహుదా, మహేంద్రతనయా, వంశధార, నాగావళి నదులు సముద్రంలో కలుస్తున్నాయి. నదుల సంగమం వద్ద ఏటా వరదలు పోటెత్తుతుండడంతో తీరం కోతకు గురవుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మించకపోవడం, నీటి స్థిరీకరణకు అవకాశం లేకపోవడం, కరకట్టల నిర్మాణం చేపట్టకపోవడంతో నీటి ప్రవాహ గమనం పెరిగి ఒకేసారి సముద్రంలోకి నీరు పోటెత్తుతోంది.

# ఎన్నాళ్లీ కష్టాలు!



అక్టోబరు 7(టుడే విదుర): కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు వడ్డాది–పాడేరు రోడ్డులో ప్రయాణమంటే వాహనచోదకులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. వడ్డాది జంక్షన్ నుంచి మండల పరిధిలో తాటిపర్తి వరకు పలుచోట్ల భారీ గోతులు ఏర్పడి, రహదారి ఛిద్రమైంది. రాళ్లు, కంకర తేలిపోయాయి. గోతుల్లో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. 20 నిమిషాల్లో ప్రయాణించాల్సించాల్సి వుండగా గంటకుపైగా సమయం పడుతున్నదని వాహనదారులు వాపోతున్నారు. పైగా ఒళ్లు హూనమవ్వడంతో పాటు వాహనాల విడి భాగాలు పాడైపోతున్నాయని అంటున్నారు. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, కార్లు, జీపులు, ఆటోలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాల్లో వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ముకుందపురం, కేజేపురం, ఎం.కోటపాడు, డి.సురవరం, సాగరం, ఎం.కోడూరు, కాశీపురం గ్రామాల వద్ద ఏర్పడిన గోతుల కారణంగా వీరంతా ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా రోడ్డు వేయడం మాట అటుంచి.. కనీసం గోతులైనా కప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆన్‘లైన్’ తప్పుతున్నారు.. సోషల్ మీడియా స్నేహాలతో అడ్డదారులు

- గాడితప్పుతున్న బాల్యం..
- పాశ్చాత్య కల్చర్ వైపు పయనం
- నేరాల బాట పడుతున్న కొందరు మైనర్లు
- తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ:అక్టోబరు 7(టుడే విదుర): ఆన్లైన్/సోషల్ మీడియా పరిచయాలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం నగర శివారులోని ఓ ఫామ్‌హౌజ పై దాడి చేసిన పోలీసులు సుమారు 50 మంది మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. సోషల్‌మీడియాలో పరిచయం పెంచుకొని ఒక్కచోట చేరిన వారంతా పార్టీ చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. పార్టీలో పలువురు మైనర్లు మద్యంతో పాటు, గంజాయిని తీసుకున్నట్లు తేలింది.అందరూ 15 నుంచి 17 ఏళ్లలోపు వారే. జల్సాలు, వ్యసనాలకు బానిసలవుతున్న యువత కొత్తరకం పాశ్చాత్య కల్చర్‌కు అలవాటుపడుతున్నారు. చిన్న వయసులోనే పార్టీలు చేసుకోవడం, మద్యంతో పాటు గంజాయి వంటి మాదక ద్రవ్యాలు వినియోగించడం తల్లిదండ్రులను, పోలీసులను తీవ్రంగా కలిచివేస్తోంది. ఇద్దరు మైనర్లకు గంజాయి పాజిటివ్ రావడం ఆందోళన కలిగిస్తోంది. రానున్న రోజుల్లో ఇలాంటి పార్టీల ద్వారా ఎంతమంది మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుంటారో అని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

%చెడు వ్యసనాల బాట

మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలు యువతను నిర్వీర్యం చేస్తున్నాయని పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. కొంతమంది పిల్లలు 15 ఏళ్ల వయసులోనే చెడు స్నేహాలు చేస్తూ మద్యం, సిగరెట్, గంజాయి వంటి అలవాట్లకు బానిసలవుతున్నారు. యుక్త వయసుకు వచ్చిన పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నారు. అందులో వారు ఏం చేస్తున్నారు? సోషల్‌మీడియాలో ఎలాంటి యాక్టివిటీస్ కు పాల్పడుతున్నారు? ఎలాంటి గేమ్స్ చూస్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారు.. వంటి అంశాలపై పర్యవేక్షణ అవసరం అని సూచిస్తున్నారు. స్కూలు/కళాశాలలో టీచర్స్ కూడా పిల్లల ప్రవర్తనను గమనించాలి. చెడు వ్యసనాలకు బానిసలైన తర్వాత వాటి కోసం దొంగతనాలు, దోపిడీలు, చివరకు తీవ్రమైన నేరాలకు మైనర్లు వెనుకంజ వేయడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు.

బాలికను చంపిన బాలుడు

ఇటీవల 12 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైంది. ఆ కేసు మిస్టరీని ఛేదించడానికి అహర్నిశలు కష్టపడిన పోలీసులు చివరకు 14 ఏళ్ల బాలుడే పక్కింటి బాలికను హత్య చేసినట్లు తేల్చారు. బ్యాట్ దొంగతనానికి వెళ్లిన బాలుడిని ఆ బాలిక అడ్డుకోవడంతో ఉద్రేకానికి లోనై కత్తితో ఆమెను విచక్షణ రహితంగా పొడిచి చంపేశాడు. దాంతో బడిలో గడపాల్సిన అతడి బాల్యం జువైనల్ హోమ్‌కు చేరింది. ఆ బాలుడికి ఓటీటీలో హర్రర్ సినిమాలు, సోషల్‌మీడియాలో ఎక్కువ



సమయం గడిపే అలవాటు ఉందని పోలీసులు గుర్తించారు.

ఇన్‌స్టా పరిచయం.. తల్లి హత్య

ఎక్కువ సమయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో గడిపే ఓ బాలికకు 19 ఏళ్ల యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. విషయం తెలిసి బాలిక తల్లి ఆమెను మందలించింది. దాంతో బాలిక ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. పోలీసులు వారిని పట్టుకుని మందలించి వదిలేశారు. తన ప్రేమ విషయం తల్లికి నచ్చలేదని భావించిన బాలిక ఆ యువకుడితో కలిసి ఏకంగా ఆమెను హత్య చేయించింది. ఈ ఘటనలో వారితో పాటు మరో బాలుడి జీవితం కటకటాల పాలైంది.

## ఐదేళ్ల గిరిజన బాలుడికి అరుదైన వ్యాధి




బొంరాసపేట్, అక్టోబరు 7(టుడే విదుర):ఐదేళ్ల బాలుడు.. ఆడిపాడే వయసులో లక్షమందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్సకు కోట్లలో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఆ నిరుపేద గిరిజన తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. బాధిత బాలుడు వికారాబాద్ జిల్లా బొంరాసపేట మండలం వడిచర్ల గ్రామ పరిధిలోని ఉరెన్కితండాకు చెందిన జగన్ (5). కొన్నాళ్లుగా బాలుడు సరిగా నడవలేకపోతుండటం, కూర్చోవడం, నిల్చోవడంలో ఇబ్బందులు పడుతుండటంతో తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి జగన్ స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ యాదవ్, బొంరాసపేట్ మండల వైద్యాధికారి హేమంత్ బాధిత కుటుంబాన్ని బొంరాసపేట్ ప్రభుత్వాస్పత్రికి పిలిపించారు. బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యాధి నివారణకు ఆరోగ్యశాఖ వద్ద ఎటువంటి మందులు అందుబాటులో లేవని, ఈ వ్యాధికి ముందులు ఖరీదైనవి అని.. ప్రైవేట్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. బాధిత కుటుంబం పరిస్థితిని కలెక్టర్ ద్వారా ఉన్నతస్థాయి అధికారులకు చేరవేస్తామని చెప్పారు. ప్రభుత్వపరంగా నిమ్స్, నిలోఫర్ ఆస్పత్రుల్లో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే వైద్యం ప్రారంభిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, వైద్యశాఖ పరంగా అండగా ఉంటామన్నారు. కాగా తమ చిన్నారికి వ్యాధి నయం అయ్యే విధంగా ప్రభుత్వం ఆదుకొని చికిత్స చేయించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## మల్లోజుల లొంగుబాట!

హైదరాబాద్/చర్ల, అక్టోబరు 7(టుడే విదుర): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోను.. పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన మల్లోజుల.. ఇటీవలి కాలంలో పార్టీ విధానాలను తప్పుబడుతుండడమే అందుకు నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. కొద్దిరోజుల క్రితం మావోయిస్టు అభయ్ పేరుతో.. సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు లేఖ విడుదల కావడం తెలిసిందే. తాజాగా మల్లోజుల వేణుగోపాల్ పేరుతో మరో లేఖ విడుదలైంది. పార్టీ తప్పిదవే సాయుధ పోరాటాన్ని దెబ్బతీసిందని పేర్కొంటూ 26 పేజీల లేఖను ఆయన విడుదల చేశారు. అభయ్ పేరుతో గతంలో విడుదలైన లేఖపై మావోయిస్టు పార్టీ అప్పుడే స్పందించింది. అభయ్ ప్రకటన ఆయన




వ్యక్తిగతమని, దాంతో పార్టీకి సంబంధం లేదని పేర్కొంది. అదే సమయంలో ఇద్దరు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పోలీసుల ఎదురు కాల్పుల్లో మరణించారు. ఈ నేపథ్యంలో అభయ్ లొంగిపోయేందుకు పోలీసులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు మావోయిస్టు పార్టీ అనుమానిస్తోంది. మరోవైపు కీలక నేతలను బయటకు రప్పించేందుకు పోలీసులు ఆడుతున్న నాటకంలో భాగమనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మల్లోజుల గానీ, మావోయిస్టు పార్టీ ఇతర కీలక నేతలు గానీ ఎవరూ తమ అదుపులో లేరని తెలంగాణ పోలీసులు అంటున్నారు. అందుకు సంబంధించి సమాచారం లేదని చెబుతున్నారు.

## డ్రైవింగ్‌లో ఇలా చేయడం డేంజర్.. సీపీ సజ్జనార్ హెచ్చరిక

%హైదరాబాద్:అక్టోబరు 7(టుడే విదుర): పోలీస్ కమిషనర్ సజ్జనార్ తాజా ట్వీట్ ద్వారా రోడ్డు భద్రతపై కీలక హెచ్చరికలు జారీ చేశారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూడటం, ఇయర్‌ఫోన్స్ వినియోగించడం వంటి చర్యలు ప్రమాదకరమైనవే కాకుండా శిక్షార్హమైనవి అని ఆయన హెచ్చరించారు. ఆటో రిక్షా, క్యాబ్, బైక్ టాక్సీలను నడుపుతున్న డ్రైవర్లు ఇలా చేస్తూ తరచుగా కనిపిస్తున్నారన్నారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ఫోన్ వాడటం వల్ల వారి దృష్టి రోడ్డుపై ఉండదని, ఇది ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ఇలాంటి నిర్లక్ష్య చర్యలపై



హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.డ్రైవర్, ప్రయాణికులు, ఇతర రోడ్డుపై ప్రయాణించే వారి భద్రత అత్యంత ముఖ్యమైనదన్నారు. జీవితం కంటే పెద్దది ఏ సమస్య కాదన్న సజ్జనార్.. ప్రతి ఒక్కరూ రోడ్డుపై భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్షణిక అవసరాల కోసం ప్రాణాలు పోగొట్టుకోవద్దని సూచించారు.

## పెబ్బేరులో గంజాయి కలకలం



పెబ్బేరు, అక్టోబరు 7(టుడే విదుర): వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలోని ఆర్టీసీ బ స్టాండ్ ఆవరణలో సాయంత్రం గంజాయిని పోలీసులు స్వాధీనం చేస్తున్నారు. ఎస్ఐ గంగిరెడ్డి యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివ రాల ప్రకారం. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లేశ్ ప్రభు అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు గంజాయిని తరలిస్తున్నాడనే స మాచారంతో పెబ్బేరు ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీ సులు రెక్కీ నిర్వహించారు. ఆ వ్యక్తిని అదుపు లోకి తీసుకొని అతని దగ్గర ఉన్న బ్యాగును పరిశీలించగా 4 కేజీల గంజాయి లభ్యమైంది. మల్లేశ్ ప్రభు అతని స్నేహితుడు దిలీప్‌కాళీ ఇద్దరూ కలిసి మోహన్, అర్జున్ అనే వ్యక్తుల దగ్గర ఒడిషాలో గంజాయిని కొనుగోలు చేసి బెంగళూరులో విక్రయించేవారు. గంజాయిని తీ సుకొని ఇద్దరూ వస్తున్న క్రమంలో దిలీప్ కాళీ తనకు పని ఉందని మధ్యలోనే బస్సు దిగి వెళ్లాడు. గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం హైదరాబాద్ యువకుడి మృతి

చాదర్‌ఘాట్, అక్టోబరు 7(టుడే విదుర): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన షెరాజ్ మెహతాబ్ మహ్మద్ (25) ప్రాణాలు కోల్పోయాడు. ఉన్నత ఉద్యోగావకాశాల కోసం ఇటీవలే అమెరికాకు వెళ్లిన షెరాజ్ మెహతాబ్ అకాలంగా మృతిచెందడం అందరినీ కలచివేసింది. షెరాజ్ తండ్రి అల్తాఫ్ మహ్మద్‌ఖాన్ (అల్తాఫ్ గోల్డీ) హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. కాగా కొన్నేళ్లుగా అమెరికాలో స్థిరపడ్డారు. షెరాజ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. షెరాజ్ మరణ వార్తతో స్వస్థలం చంచల్‌గూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, స్నేహితులు అతడి నివాసానికి




చేరుకుని షెరాజ్‌తో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కంటతడిపెట్టారు. మసీదులో నమాజ్ అనంతరం అతడి పేరుపై ముస్లిం షెరియా ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## పీఎంఓ పేరిట మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్, అక్టోబరు 7(టుడే విదుర): ప్రధానమంత్రి కార్యాలయ అధికారిగా నటించి రామారావు అనే వ్యక్తి మోసాలకు పాల్పడ్డాడు. మోసాలు చేస్తున్న రామారావుపై సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం ఇచ్చిన ఫిర్యాదుతో రామారావుపై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. పీఎంఓలో సీనియర్ అధికారిగా నటిస్తూ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రభుత్వ అధికారులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. టీటీడీలో సుప్రభాత దర్శనం కోసం సిఫార్సు లేఖ రాశాడు రామారావు. కర్ణాటకలోని రెవెన్యూ అధికారులకు కూడా లేఖ రాసి భూముల రికార్డులు కావాలని కోరాడు రామారావు. అలాగే, ప్రముఖ యూనివర్సిటీకి లేఖ రాసి అడ్మిషన్ కావాలని సిఫార్సు చేశాడు రామారావు. ఈ క్రమంలో పీఎంఓ కార్యాలయాన్ని సంప్రదించారు టీటీడీ అధికారులు. రామారావు పేరుతో డిప్యూటీ సెక్రటరీ ఎవరూ లేరని పీఎంవో స్పష్టం చేసింది. పీఎంవో అసిస్టెంట్ డైరెక్టర్ ఇచ్చిన ఫిర్యాదుపై సీబీఐ అధికారులు రామారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# టుడే వినోదం

## కమల్ – రజనీ మల్టీస్టారర్ దర్శకుడు క్లారిటీ..




నాలుగున్నర దశాబ్ధాల తర్వాత ఒకే సినిమాలో కనిపించనున్న సంగతి తెలిసిందే! వీరిద్దరూ కలిసి ఓ మల్టీస్టారర్ చేయబోతున్నారని అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచి ఈ సినిమా గురించి ఏదో ఒక వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. తొలుత ఈ చిత్రానికి లోకేష్ కనకరాజు దర్శకత్వం వహిస్తారని వార్తలొచ్చారు. వాటిని దర్శకుడు కొట్టిపారేశారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదని లోకేశ్ చెప్పారు. తదుపరి ప్రదీప్ రంగనాథన్ ఈ చిత్రానికి దర్శకుడని నెట్టింట వార్తలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు దీనిపై ప్రదీప్ క్లారిటీ ఇచ్చారు. ‘ఆ రజనీకాంత్, కమల్‌హాసన్‌ల మల్టీస్టారర్ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం నాకు వచ్చిందో లేదో నేను చెప్పను. కానీ నేనీ ప్రాజెక్ట్‌లో భాగం కాదు. ఎందుకంటే ప్రస్తుతం దర్శకత్వం మీద కంటే యాక్టింగ్ మీదే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాను. ఈ మల్టీస్టారర్ గురించి ఇంతకన్నా ఏం చెప్పలేను. నేను రజనీకాంత్‌కు వీరాభిమానిని. ఇప్పటివరకూ విడుదలైన ఆయన సినిమాలు మొదటిరోజు మొదటి ఆట చూశాను. ‘డ్రాగన్’ విడుదలయ్యాక ఆయన నన్ను ప్రశంసించారు. ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేను” అని ప్రదీప్ అన్నారు. ఈ మధ్యన జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్‌హాసన్ ఈ మల్టీస్టారర్ గురించి అధికారికంగా తెలిపారు. ‘మీరు, రజనీకాంత్ కాంబినేషన్‌లో ఓ సినిమాను ఆశించవచ్చా’ అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. ‘ప్రేక్షకులు మా కాంబినేషన్‌ను ఇష్టపడటం మంచిదే కదా. అభిమానులు, ప్రేక్షకుల ఆనందమే మా ఆనందం. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసిరానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది’ అని స్పష్టంచేశారు.



## అజిత్ రీల్ కూతురు.. దేవుడా ఈ రేంజ్ లో రెచ్చిపోయిందేంటి




ఆడపిల్లలు చూస్తుండగానే ఎదిగిపోతారు అని పెద్దలు అంటారు. ఇండస్ట్రీలో బాలనటీమణులను చూస్తుంటే నిజమే అనిపించకమానదు. స్టార్ హీరోల సినిమాల్లో కనిపించి చైల్డ్ ఆర్టిస్ట్ లుగా గుర్తింపు తెచ్చుకున్నవారే రెండేళ్ల తిరక్కముందే హీరోయిన్స్ గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇక మలయాళంలో చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించింది అనికా సురేంద్రన్( గుర్తింపులేని పాత్రలు చేస్తూ చేస్తూ బిజీ చైల్డ్ ఆర్టిస్ట్ గా మారింది.

ఇక అజిత్ నటించిన విశ్వాసం సినిమాలో అజిత్ – నయన్ ల కూతురుగా నటించి మరింత పేరు తెచ్చుకుంది అనికా. ఆ సినిమా తెలుగులో కూడా మంచి విజయాన్ని అందుకోవడంతో ఇక్కడ కూడా ఎన్నికకు మంచి గుర్తింపు లభించింది. ఇక ఆ తరువాత తెలుగులో నాగార్జున నటించిన ఘోస్ట్ లో కూడా అదరగొట్టింది. అలా చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపిస్తూనే ఒక్కసారిగా హీరోయిన్ గా మారిపోయింది. తెలుగులో బుట్టబొమ్మ అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందివ్వలేకపోయింది. ఇక ఈ ఏడాది జాబిలమ్మ నీకు అంత కోపమా అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అనికా మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ చిన్నది వయస్సు పెరిగేకొద్దీ అందాల ఆరబోత చేస్తూ గ్లామర్ పాత్రలకు కూడా సిద్ధమని హింట్ ఇస్తుంది. తాజాగా రెడ్ కలర్ డ్రెస్ లో అనికా అందాల ఆరబోత నెటిజన్స్ కు షాక్ ఇచ్చింది. ఎద అందాలను ఆరబోస్తూ టాప్ యాంగిల్ లో అమ్మడి పోజులు పిచ్చెక్కిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఓర్నీ.. ఈ పిల్ల ఈ రేంజ్ లో రెచ్చిపోతుందేంటీ అంటూ నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

## శతదినోత్సవం చూసిన ‘జయం మనదేరా’




‘జయం మనదేరా’ సినిమాకు ముందు ‘ప్రేమించుకుందాం రా, ప్రేమంటే ఇదేరా, కలిసుందాం రా’ వంటి చిత్రాలతో ఘనవిజయాలు చూశారు వెంకటేశ్ ఆ ‘రా’ సెంటిమెంట్ తోనే ‘జయం మనదేరా’ అన్న టైటిల్ తో జనం ముందుకు వచ్చారు. తొలి చిత్రం ‘ఎన్ కౌంటర్’తోనే దర్శకునిగా మంచి మార్కులు సంపాదించిన శంకర్ ‘జయం మనదేరా’కు డైరెక్టర్. శంకర్ చిత్రాల్లో అట్టడుగు వర్గాల వారి పక్షాన నిలచి పోరాడే కథానాయకుల పాత్రలే ప్రధానంగా ఉండేవి. అదే తీరున ‘జయం మనదేరా’ కథ కూడా రూపొందింది. ఈ చిత్రానికి పరుచూరి బ్రదర్స్ రచన మరింత వన్నె తెచ్చింది. వందేమాతరం శ్రీనివాస్ బాణీల్లో రూపొందిన పాటలు విశేషాదరణ చూరగొన్నాయి. 2000 సంవత్సరం సంక్రాంతి సంబరాల్లో ‘కలిసుందాం రా’తో బిగ్ హిట్ పట్టేసిన వెంకటేశ్ ఆ యేడాది అక్టోబర్ 7న విడుదలైన ‘జయం మనదేరా’తోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ‘జయం మనదేరా’ చిత్రాన్ని సురేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై డి.రామానాయుడు సమర్పణలో డి.సురేశ్ బాబు నిర్మించారు. అప్పటికే వెంకటేశ్ తో ‘ఇంట్లో ఇల్లాలు– వంటింట్లో ప్రియురాలు, పవిత్రబంధం, పెళ్ళిచేసుకుందాం, రాజా’ వంటి సూపర్ హిట్స్ చూశారు సౌందర్య. వెంకటేశ్– సౌందర్య (%వాశీబఅఝుతీఝు%) జంట ‘జయం మనదేరా’లోనూ ప్రేక్షకులకు కనువిందు చేసింది. ఈ సినిమాతో వెంకటేశ్, సౌందర్య పెయిర్ మరో హిట్ ను తమ ఖాతాలో వేసుకోవడం విశేషం. రాయలసీమ ఫ్యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో రూపొందిన చిత్రాలకు అప్పట్లో విశేషాదరణ ఉండేది. ‘జయం మనదేరా’ కూడా అదే తీరున సాగింది. ఇందులో తండ్రీకొడుకులుగా వెంకటేశ్ ద్విపాత్రాభినయం చేయగా, తండ్రికి జోడీగా భానుప్రియ నటించారు. ఈ సినిమాను పరిశీలించి చూస్తే ‘బాహుబలి’ మొదటి భాగం కథ ఇలాగే ఉంటుంది. యాభై రోజుల దాకా రికార్డ్ స్థాయిలో ప్రదర్శితమైన ‘జయం మనదేరా’ తరువాత చప్పబడిపోయింది. ఏది ఏమైనా ఆ యేడాది టాప్ గ్రాసర్స్ లో ఒకటిగా నిలచిందీ చిత్రం. ఈ సినిమాతో జయప్రకాశ్ రెడ్డి బెస్ట్ విలన్ గానూ, ఝాన్సీ బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్ గానూ నంది అవార్డులు అందుకున్నారు. ఈ చిత్రాన్ని తమిళంలో అర్జున్ హీరోగా ‘మణికంఠ’ పేరుతో రీమేక్ చేశారు.

## నాగవంశీ కి ‘బాహుబలి’ గండం




మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం ఒక మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెల్సిందే. గతేడాది ఈగల్, మిస్టర్ బచ్చన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా అవేమి ఆశించిన ఫలితాన్ని అందించలేకపోయాయి. ఇక ఈ ఏడాదిలో మాస్ జాతర అంటూ ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమయ్యాడు. మాస్ మహారాజా రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం మాస్ జాతర. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమాలో రవితేజ సరసన శ్రీలీల నటిస్తోంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో ధమాకా రిలీజ్ అయ్యి మంచి హిట్ అందుకుంది. ఇక మాస్ జాతరపై ప్రేక్షకులు బాగానే అంచనాలు పెట్టుకున్నారు. అన్ని బావుండి ఉంటే ఈ పాటికీ ఈ సినిమా రిలీజ్ అయ్యి ఉండేది. కానీ, కొన్ని కారణాల వలన మాస్ జాతర అక్టోబర్ 31 కి వాయిదా పడింది. అయితే అదే రోజు బాహుబలి ది ఎపిక్ రిలీజ్ అవుతుంది. ప్రస్తుతం ఇదే మాస్ జాతరకు పెద్ద గండంగా మారింది. రెండు పెద్ద సినిమాల మధ్య పోటీ అనేది సాధారణమే. కానీ, ఇక్కడ ఒక రీరిలీజ్.. మరో కొత్త సినిమా పోటీ పడడం.. అందులోనూ రీరిలీజ్ సినిమానే ఎక్కువ హైప్ తెచ్చుకోవడం అనేది విశేషంగా మారింది. బాహుబలి ది ఎపిక్ ను కూడా రీ రిలీజ్ అనలేం. బాహుబలి 1, బాహుబలి 2 రెండు పార్ట్స్ ను కలిపి.. అనవసరమైనవి తీసేసి.. కొత్త సీన్స్ యాడ్ చేసి.. సరికొత్త సినిమాగా రిలీజ్ చేస్తున్నాడు జక్కన్న. అంతేకాకుండా ఈ సినిమా ఎండింగ్ లో ఒక పెద్ద సర్ ప్రైజ్ ని కూడా యాడ్ చేసినట్లు నిర్మాత శోభు యార్లగడ్డ చెప్పుకొచ్చాడు. దీంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇక ఇంకోపక్క మాస్ జాతర కూడా అంతే హైప్ తెచ్చుకోవడానికి తెగ ప్రయత్నాలు చేస్తుంది. ముఖ్యంగా నాగవంశీ ఎలాగైనా ఈ సినిమాను గట్టెక్కించాలని చాలా కష్టపడుతున్నాడు. ఇప్పటికే నాగవంశీ.. చిత్రబృందంతో వరుస ఇంటర్వ్యూలు ఇవ్వడం మొదలుపెట్టాడు. లిరికల్ సాంగ్స్ ఒకపక్క, సోషల్ మీడియాలో హైప్ పెంచడానికి తనదైన రీతిలో ప్లాన్ చేస్తున్నాడు. అయితే రాజమౌళి ప్రమోషన్స్ ఎలా ఉంటాయో అందరికీ తెల్సిందే. కొత్త సినిమా అయినా.. రీరిలీజ్ అయినా ఆయన స్ట్రాటజీనే వేరు. ఊరికే ప్రభాస్ అలా కనిపిస్తే చాలు హైప్ దానంతట అదే పెరిగిపోతుంది. అందుతున్న సమాచారం ప్రకారం బాహుబలి ది ఎపిక్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ప్రభాస్, రానా, స్వీటీని కూడా తీసుకురావాలనే ప్లాన్ లో ఉన్నాడట జక్కన్న. ఇదే కనుక జరిగితే.. మాస్ జాతర గురించి పట్టించుకునేవారే ఉండరు అని నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు. ఇక వసూళ్ల గురించి చెప్పనవసరం లేదు. బాహుబలి ది ఎపిక్ కోసం అభిమానులు ఏ రేంజ్ లో ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. మొదటిరోజు కనుక మాస్ జాతర హిట్ టాక్ కనుక అందుకోలేదు అంటే బాహుబలి ముందు నిలబడడం చాలా కష్టంతో కూడుకున్న పని. అందులోనూ రవితేజకు అంత హిట్ ట్రాక్ కూడా లేదు. నాగవంశీ పరిస్థితి కూడా ఇంచు మించు అలానే ఉంది. ఇప్పుడు నాగవంశీకి బాహుబలి గండం చుట్టుకుంది. బాహుబలి దెబ్బ నుంచి రవితేజ, నాగవంశీ బయటపడగలరా లేదా.. అనేది చూడాలి.

## కిరణ్ అబ్బవరం మూవీ డైరెక్టర్ మారిపోయాడా...




తొలి చిత్రం ‘కొత్త బంగారు లోకం’ తో సక్సెస్ ఫుల్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్నాడు శ్రీకాంత్ అడ్డాల మలి చిత్రం ‘సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు’ తో స్టార్ హీరోలను సైతం అతను హ్యాండిల్ చేయగలడనిపించుకున్నాడు. ఇక అతను దర్శకత్వం వహించిన ‘ముకుంద’ తోనే వరుణ్ తేజ్ హీరోగా పరిచయం అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన ‘బ్రహ్మోత్సవం’ పరాజయంతో శ్రీకాంత్ అడ్డాల ఫేట్ తిరగబడింది. ఆ తర్వాత మూవీ చేయడానికి ఏకంగా ఐదేళ్ళు పట్టింది. వెంకటేశ్ తో శ్రీకాంత్ అడ్డాల రీ–మేక్ చేసిన ‘అసురన్’ మూవీ ‘నారప్ప’గా ఓటీటీలో వచ్చింది. ఆపైన రెండేళ్ళకు ‘పెద్ద కాపు 1’ సినిమాను తీశాడు శ్రీకాంత్ అడ్డాల. చిత్రం ఏమంటే... ఒకప్పుడు టాలీవుడ్ క్రేజీ డైరెక్టర్ గా పేరు తెచ్చుకున్న శ్రీకాంత్ అడ్డాల ఇప్పుడు సినిమాను సెట్ చేసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తోంది.

# రోహిత్, కోహ్లీకి మరో బ్యాడ్ న్యూస్ తప్పదా..
## గవాస్కర్ ఏమన్నారంటే..

టీమిండియా దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత తిరిగి మైదానంలో అడుగుపెట్టబోతున్నారు. ఆస్ట్రేలియాతో ఈ నెలలో జరిగే వన్డే సిరీస్ కోసం బరిలోకి దిగబోతున్నారు. 2027 ప్రపంచకప్ వరకు వారు జట్టులో కొనసాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. వారు కూడా అదే ఆలోచనతో ఉన్నారు. అయితే భారత వన్డే జట్టు కెప్టెన్సీ నుంచి రోహిత్ శర్మను తప్పించి సెలక్టర్లు షాకిచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు.'అప్రమత్తంగా లేకపోతే రోహిత్‌కు మరో బ్యాడ్ న్యూస్ తప్పదు. 2027 వన్డే ప్రపంచ కప్ (2027 వరకు భారత జట్టుకు ఎక్కువ వన్డే మ్యాచ్‌లు లేవు. కాబట్టి రోహిత్, కోహ్లీ తమ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలంటే దేశవాళీ క్రికెట్‌లో చురుకుగా ఉండాలి. మీరు (రోహిత్, కోహ్లీ) నిబద్ధతతో లేకపోతే, మీరు రాబోయే 2 సంవత్సరాలకు సిద్ధంగా ఉంటారా లేదా అని నిర్ణయించుకోలేకపోతే, బ్యాడ్ న్యూస్ కోసం సిద్ధంగా ఉండండి. మీరు కేవలం వన్డేలు మాత్రమే ఆడితే ప్రాక్టీస్ ఎక్కువ అవసరం అవుతుంది' అని గవాస్కర్ పేర్కొన్నారు.




'ఎవరికైనా జట్టు ప్రయోజనాలే ముఖ్యం. 2027 ప్రపంచకప్ లోపు టీమిండియా చాలా తక్కువ వన్డేలు ఆడుతోంది . ఈ నేపథ్యంలో ఫామ్, ఫిట్‌నెస్ కాపాడుకోవడం ఎవరికైనా చాలా కీలకం. ప్రపంచ కప్ లాంటి పెద్ద టోర్నమెంట్‌కు అవసరమైన ప్రాక్టీస్ కావాలి. జట్టులో రోహిత్ స్థానం పక్కా కానందువల్లే శుభమన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసి ఉంటారు' అని గవాస్కర్ అన్నారు.

# జట్టు సంస్కృతి దెబ్బతినకూడదనే



ముంబై: ఆస్ట్రేలియాలో పర్యటనకు ఇటీవల ప్రకటించిన భారత జట్టులో రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. టీ20లు, టెస్టుల నుంచి వైదొలగిన హిట్‌మ్యాన్ కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. కానీ ఒక ఫార్మాట్‌కే సారథిగా ఉన్న రోహిత్ తనదైన శైలిలో జట్టును నడిపిస్తాడని.. అది జట్టుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నట్లు సమాచారం. 'రోహిత్ స్థాయి ఆటగాడు నాయకత్వ బాధ్యతల్లో ఉంటే..డ్రెస్సింగ్ రూమ్‌లో తనదైన ముద్ర వేస్తాడు. ఒకే ఫార్మాట్‌లో.. అది కూడా ఎప్పుడో జరిగే వన్డేలకు అతడు కెప్టెన్‌గా ఉండడం జట్టు సంస్కృతిని దెబ్బ తీస్తుంది' అని బీసీసీఐ ముఖ్యుడొకరు వెల్లడించారు. కోచ్‌గా నియమితుడైన గంభీర్ తొలి ఆరు నెలలు జట్టుపై ఏమాత్రం పట్టు సాధించలేకపోయాడట. అయితే న్యూజిలాండ్‌తో స్వదేశంలో, ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు టెస్టులు ఓడిపోవడం గంభీర్‌కు కలిసొచ్చింది. ఆ రెండు సిరీస్‌లలో పరాజయాల అనంతరం కోచ్‌గా గంభీర్ జట్టును తన చేతుల్లోకి తీసుకున్నాడట.వన్డే వరల్డ్ కప్‌కు జట్టును సన్నద్ధం చేసే క్రమంలో రోహిత్ శర్మను సారథ్య బాధ్యతల నుంచి తప్పించి ఉంటారని దిగ్గజ బ్యాటర్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయంతో రోహిత్ కూడా ఏకీభవిస్తాడని చెప్పాడు. '2027 ప్రపంచ కప్‌కు రోహిత్ సిద్ధంగా ఉంటాడో లేదో తెలియదు. అతడు వన్డేలే ఆడుతున్నాడు. అంతర్జాతీయ కేలండర్‌ను చూస్తే భారత జట్టు పెద్దగా 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడబోవడంలేదు. ఏడాదికి ఐదు నుంచి ఏడు వన్డేలు ఆడితే వరల్డ్ కప్‌లాంటి పెద్ద టోర్నీకి కావాల్సినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించదు. అందుకే శుభ్‌మన్‌ను సన్నద్ధం చేసేందుకు కెప్టెన్సీపై నిర్ణయం తీసుకొని ఉంటారు. పైగా..50 ఓవర్ల ఫార్మాట్‌కు జట్టు యాజమాన్యం ప్రణాళికలను పటిష్ఠం చేసుకోవాలని భావిస్తున్నందున రాబోయే రోజుల్లో మరిన్ని చేదు వార్తలు వినాల్సి రావొచ్చు' అని గవాస్కర్ అన్నాడు. అంటే..రోహిత్ వన్డేలకూ వీడ్కోలు పలుకుతాడన్న అభిప్రాయాన్ని గవాస్కర్ పరోక్షంగా చెప్పాడన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

# వెళ్లి ఆటో నడుపుకోమంటారు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో పేసర్ మహ్మద్ సిరాజ్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో నిలకడగా చోటు దక్కించుకుంటున్నాడు. అయితే కెరీర్ ఆరంభంలో సరిగ్గా రాణించకపోవడంతో విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగితేనే ఫలితం ఉంటుందని సిరాజ్ చెబుతున్నాడు. 'నువ్వు బాగా రాణిస్తే అభిమానులతో పాటు క్రీడాలోకం కూడా సిరాజ్‌లాంటి బౌలర్ మరొకరు లేడంటూ పొగుడుతారు. అదే విఫలమైతే.. 'నువ్వేం బౌలర్‌వి? వెళ్లి మీ తండ్రితో కలిసి ఆటో నడుపుకో' అంటూ విమర్శిస్తారు. అంత త్వరగా వీరు తమ అభిప్రాయాలను ఎలా మార్చుకుంటారు? అందుకే బయట నుంచి వచ్చే కామెంట్స్, విమర్శలను పట్టించుకోకూడదనుకున్నా. నా జట్టు సభ్యులు, కుటుంబం ఎలా ఆలోచిస్తున్నారన్నదే నాకు ముఖ్యం. ఇతరుల గురించి నాకనవసరం' అని సిరాజ్ స్పష్టం చేశాడు. భారత జట్టులో




చోటు దక్కించుకున్నప్పుడు ధోనీ కూడా తనకిదే సలహా ఇచ్చినట్లు గుర్తుచేసుకున్నాడు.

# భగత్‌కు మూడు స్వర్ణాలు



న్యూఢిల్లీ: నైజీరియాలో జరిగిన అబియా పారా బ్యాడ్మింటన్ టోర్నీలో ఏస్ షట్లర్ ప్రమోద్ భగత్ మూడు స్వర్ణాలు సాధించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గిన ప్రమోద్.. ఆ తర్వాత నాడాకు మూడుసార్లు తాను ఎక్కడ ఉన్నదీ తెలియజేయలేదు. దీంతో 18 నెలల నిషేధానికి గురైన భగత్.. పారిస్ పారాలింపిక్స్‌లో ఆడలేకపోయాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్ 3 కేటగిరీలో భారత షట్లర్ల మధ్య జరిగిన ఫైనల్లో ప్రమోద్ 21-7, 9-21, 21-9తో మాంటు కుమార్‌పై గెలిచాడు. డబుల్స్ తుదిపోరులో ప్రమోద్-సుకాంత్ కదమ్ జోడీ 21-13, 21-17తో నెగ్గింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆర్తీ పాటిల్‌తో కలసి ఆడిన ప్రమోద్ మూడో బంగారు పతకాన్ని సొంతం చేసుకొన్నాడు. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో రజతం సాధించిన ఉమా సర్కార్.. డబుల్స్‌లో ఆర్తితో కలసి కాంస్యం అందుకొంది. డబ్ల్యూహెచ్1 విభాగంలో రంజిత్ సింగ్ మూడు కాంస్యాలు దక్కించుకొన్నాడు. ఎస్‌యు5 కేటగిరీలో కరణ్, రాహుల్, సతివద స్వర్ణ, రజత, కాంస్యాలతో క్లీన్‌స్వీప్ చేశారు.

# టుడే స్పోర్ట్స్

# మిథాలీ పేరిట స్టాండ్

విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఒక స్టాండ్‌కు భారత మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరును, అలాగే స్టేడియంలోని ఓ గేటుకు మరో క్రికెటర్ రావి కల్పన పేరు పెట్టనున్నారు. ఆదివారం ఇక్కడ భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మహిళల వరల్డ్‌కప్ మ్యాచ్ సందర్భంగా వీటిని ఆవిష్కరించనున్నారు. ఇటీవలే ఓ చాట్ షోలో మహిళా క్రికెటర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని మంత్రి నారా లోకేష్‌కు స్మృతి మంధాన విజ్ఞప్తి చేసింది. తక్షణం స్పందించిన లోకేష్ స్టాండ్స్‌కు మహిళా క్రికెటర్ల పేర్లు పెట్టే ప్రతిపాదన చేయగా ఏసీఏ ఆమోదించింది.



# విశాఖ చేరుకున్న హర్మన్ సేన



దక్షిణాఫ్రికాతో ఈనెల తొమ్మిదిన జరిగే మహిళల ప్రపంచ కప్ వన్డే మ్యాచ్‌లో తలపడే భారత జట్టు సోమవారం నగరానికి చేరుకుంది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటికే శ్రీలంక, పాకిస్థాన్ జట్లపై విజయాలు సాధించి మంచి ఊపుమీదుంది. భారత జట్టుకు విశాఖ విమానాశ్రయంలో ఆంధ్ర క్రికెట్ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. భారత క్రికెటర్లు మంగళవారం సాయంత్రం సాధన చేస్తారు.

# ఫైనల్లో హుస్సాముద్దీన్



చెన్నై: తెలుగు బాక్సర్ మొహమ్మద్ హుస్సాముద్దీన్ బీఎఫ్ఐ కప్ ఫైనల్లో ప్రవేశించి పతకం ఖాయం చేసుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల 55-60 కిలోల సెమీస్ బౌట్‌లో హుస్సాముద్దీన్ 5-0తో మితేష్ దేశ్వాల్ (రైల్వేస్)ను చిత్తుగా ఓడించాడు. మిగతా బాక్సర్లలో మాజీ వరల్డ్ చాంపియన్ అనుక్షిత బోరో, అరుంధతి చౌధరి స్వర్ణాలు సాధించారు. అనుక్షిత (అస్సాం) 60-65 కిలోల కేటగిరీ ఫైనల్లో 3-2తో పార్థవి (రాజస్థాన్)పై, 65-70 కిలోల ఫైనల్ బౌట్‌లో అరుంధతి (సర్వీసెస్) 5-0తో స్నేహ (ఏపీ)పై విజయం సాధించారు. 45-48 కిలోల ఫైనల్లో నివేదిత (ఉత్తరాఖండ్) 3-2తో మంజు రాణి (రైల్వేస్)ని ఓడించి విజేతగా నిలిచింది. భావన శర్మ (రైల్వేస్) 5-0తో సవిత (రైల్వేస్)పై నెగ్గి బంగారు పతకం దక్కించుకుంది.

# బ్రిట్స్ భళా

ఇండోర్: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా బోణీ చేసింది. తజ్మీన్ బ్రిట్స్ (101) అసాధారణ ఫామ్‌ను కొనసాగిస్తూ శతకంతో అదరగొట్టడంతో సోమవారం న్యూజిలాండ్‌పై సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఏడాది బ్రిట్స్‌కు ఇది ఐదో వన్డే శతకం కావడం విశేషం. ఈ క్రమంలో ఒక కేలండర్ ఇయర్‌లో నాలుగు శతకాలు బాదిన టీమిండియా స్టార్ స్మృతి మంధాన రికార్డును బ్రిట్స్ అధిగమించింది. మంధాన నిరుడు నాలుగు, ఈ సంవత్సరం కూడా నాలుగు సెంచరీలు చేసింది. ఇక.. ఈ టోర్నీలో తమ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై 69 పరుగులకే కుప్పకూలిన సౌతాఫ్రికా.. కివీసపై ఆల్‌రౌండ్ షో ప్రదర్శించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 47.5 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ సోఫీ డివైన్ (85), బ్రూక్ హ్యాలీడే (45), జార్జియా ప్లిమ్మర్ (31) రాణించారు. స్పిన్నర్ ఎంలబాకు 4 వికెట్లు దక్కాయి. కివీస్ తమ చివరి ఏడు వికెట్లను కేవలం 44 పరుగుల తేడాతో కోల్పోయింది ఆ తర్వాత ఛేదనలో సౌతాఫ్రికా 40.5 ఓవర్లలోనే 234/4 స్కోరుతో నెగ్గింది. రెండో వికెట్‌కు బ్రిట్స్-సున్ లూస్ (83 నాటౌట్) 159 రన్స్ జోడించారు. కెర్‌కు 2 వికెట్లు లభించాయి. బ్రిట్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

టుడే బిజినెస్

# ఈపీఎఫ్ఓ నుంచి శుభవార్త.. పెన్షన్ పెంపు, కొత్త సంస్కరణల అమలు

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పెన్షనర్లకు శుభవార్త అందించనుంది. గత 11 సంవత్సరాలుగా మార్పు లేకుండా ఉన్న కనీస నెలవారీ పెన్షన్‌ను పెంచేందుకు సంస్థ చర్చలు జరుపుతోంది. అక్టోబర్ 10%-%11 తేదీలలో బెంగళూరులో జరగనున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశంలో పెన్షన్ పెంపుతోపాటు సేవలను డిజిటలీకరణ చేసే %జ్రూఖీ% 3.0 విధానం, పరిపాలనా సంస్కరణలు కూడా ఈ చర్చలో ఉంటాయి.ప్రస్తుతం ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ కింద కనీస నెలవారీ పెన్షన్ రూ. 1,000గా ఉంది. 2014 నుంచి ఈ మొత్తంలో ఎటువంటి సవరణ జరగలేదు. జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో, ద్రవ్యోల్బణం పెన్షనర్ల జీవనాన్ని మరింత కష్టతరం చేస్తోంది. ఈ కారణంగా ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా పెన్షన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంఘాలు కనీస పెన్షన్‌ను రూ. 7,500కి పెంచాలని కోరుతున్నాయి.ఈ క్రమంలో నివేదికల ప్రకారం %జ్రూఖీ% రూ. 2,500 వరకు పెన్షన్‌ను పెంచాలని చూస్తున్నట్లు తెలిసింది. ఈ పెంపు బోర్డు సభ్యుల ఏకాభిప్రాయంపై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం కూడా తుది ఆమోదం ఇవ్వాలి. పెన్షన్ పెంచడం వల్ల %జ్రూూ%-95 స్కీమ్‌లోని దాదాపు 70 లక్షల మందికి ఊరట లభించనుంది. ఈ స్కీమ్ కింద, ఉద్యోగులు తమ జీతంలో కొంత భాగాన్ని %జ్రూఖీ%కి చెల్లిస్తారు. ఇది రిటైర్మెంట్ తర్వాత వారికి పెన్షన్‌గా అందుతుంది.పెన్షన్ పెంపుతో పాటు, %జ్రూఖీ% తన సేవలను పూర్తిగా డిజిటల్, కాగిత రహితంగా మార్చేందుకు 3.0ని ప్రవేశపెట్టనుంది. దీనిలో





భాగంగా సభ్యులకు మరింత సౌలభ్యం కల్పించే లక్ష్యంతో అనేక సేవలను పరిచయం చేయనున్నారు.సభ్యులుల ద్వారా తమ %ూఖీ% మొత్తాన్ని నేరుగా ఉపసంహరించుకునే సౌకర్యం ద్వారా త్వరితగతిన %ూఖీ% ఉపసంహరణ చేసుకునే అవకాశంక్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించడం ద్వారా సభ్యులకు సమయం ఆదా కానుందిడెత్ క్లెయిమ్‌లను ఆన్‌లైన్‌లో సులభంగా ప్రాసెస్ చేసుకునే అవకాశంసభ్యుల డేటాను సమగ్రంగా నిర్వహించడం ద్వారా సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నారు. ఈ డిజిటల్ సంస్కరణలు %జ్రూఖీ% సేవలను సులభతరం చేయడమే కాక, సభ్యులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించడంలో సహాయపడతాయి.

# పసిడి పరుగులు.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 7న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 20, 780కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 10, 710కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 20, 930కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 10, 860కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 20, 780కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 10, 710కి చేరింది . వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

# మళ్లీ జోష్‌లో స్టాక్ మార్కెట్లు.. రికార్డ్ స్థాయిలో నిఫ్టీ, ఇన్వెస్టర్లకు ఊరట




%భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం (అక్టోబర్ 7, 2025) రెండో రోజు కూడా పాజిటివ్ ధోరణిలో కొనసాగాయి. ఈ క్రమంలో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 462.15 పాయింట్లు ఎగసి 82,252.27 స్థాయికి చేరుకుంది. అదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 124.55 పాయింట్లు పెరిగి 25,197.70 వద్ద నిలిచింది. ఈ నిఫ్టి రికార్డ్ స్థాయికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున లాభపడ్డారు. సెన్సెక్స్‌లో టాప్ గెయినర్స్, లూజర్స్ ఈ క్రమంలో సెన్సెక్స్‌లోని కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ వంటి షేర్లు 1.9 శాతం వరకు లాభాలను అందుకోగా, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. వీటి పనితీరు మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలను చూపించింది.

మార్కెట్లలో ఉత్సాహం

ఈ క్రమంలో మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్100, స్మాల్‌క్యాప్100 సూచీలు వరుసగా 0.42 శాతం, 0.34 శాతం లాభాలతో ట్రేడయ్యాయి. సెక్టోరల్ సూచీల్లో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్, నిఫ్టీ రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.8 శాతం వరకు పెరిగి అగ్రగామిగా నిలిచాయి. కానీ నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.3 శాతం వరకు తగ్గాయి.

వొడాఫోన్ ఐడియా షేర్ల జోరు

వొడాఫోన్ ఐడియా షేర్లు మంగళవారం అద్భుత జోష్‌తో దూసుకెళ్లాయి. బీఎస్ఈలో కంపెనీ షేరు 8 శాతం పెరిగి రూ. 9.2 వద్ద ఎనిమిది నెలల గరిష్ట స్థాయిని తాకింది. సెప్టెంబర్ నుంచి ఈ షేరు ధర ఏకంగా 42 శాతం పెరిగింది.

# గుడ్ న్యూస్.. త్వరలో తగ్గనున్న ఈవీల ధరలు..

ఈ మధ్య కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాహనాలు కొనాలనుకునేవారు ఈవీల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే, పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఈవీల ధర ఎక్కువ ఉంటుంది. ఈవీలు అంత ధర ఉండటానికి కారణం వాటి బ్యాటరీలే. ఈ బ్యాటరీల కారణంగా ఈవీ కొనుగోలుదారులపై అధిక భారం పడుతుంది.బ్యాటరీ ప్రాబ్లమ్ వస్తే అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది. అధిక ధరలు, బ్యాటరీ మెయిన్‌టెనెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చాలా మంది ఈవీలు కొనడానికి తటపటాయిస్తున్నారు. అలాంటి వారికి రోడ్ ట్రాన్స్‌పోర్ట్, హైవేస్ మినిస్టర్ నితిన్ గడ్కరీ శుభవార్త చెప్పారు. త్వరలో ఈవీల ధరలు తగ్గనున్నాయని ప్రకటించారు. సోమవారం ఆయన ఎఫ్ఐసీసీఐ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో నితిన్ గడ్కరీ మాట్లాడుతూ..




నేను ఎలక్ట్రిక్ వాహనాలు లాంచ్ చేసినపుడు బ్యాటరీ ధర కిలోవాట్‌పర్ అవర్‌కు 150 డాలర్లు ఉండేది. ఇప్పుడు 55 డాలర్ల నుంచి 65 డాలర్ల మధ్యలో ఉంది. రానున్న నాలుగు నుంచి ఆరు నెలల్లో ఎలక్ట్రిక్ స్కూటర్స్, కార్లు, బస్సుల ధరలు పెట్రోల్, డీజల్ వాహనాలతో సమానంగా ఉంటాయి. ట్రాక్టర్లు తయారు చేసే వారు.. వ్యవసాయ పరిశోధకులు క్లీన్ ఎనర్జీ పరికరాలపై పని చేయాలి. ఇథనాల్‌తో నడిచే ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, ఇంజిన్లు తయారు చేయాలి' అని చెప్పారు.

# బంగారు నగ.. భగ భగ

న్యూఢిల్లీ: పండగ సీజన్‌లో పసిడి, వెండి బెంబేలెత్తిస్తున్నాయి. ఈ విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. తులం బంగారం రూ.1.23 లక్షలు దాటేయగా.. కిలో వెండి రూ.1.60 లక్షల దిశగా పరుగులు తీస్తోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం సోమవారం ఏకంగా రూ.2,700 ఎగబాకి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,23,300కు పెరిగింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.2,700 పెరిగి కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,22,700కు చేరింది. వెండిదీ అదే తీరు. కేజీ సిల్వర్ రూ.7,400 పెరుగుదలతో మరో కొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.1,57,400కు ఎగబాకింది. ఖజానా ఖాళీ అవడంతో అమెరికా ప్రభు త్వ యంత్రాంగం స్తంభించిపోయి (యూఎస్ షట్‌డౌన్) 6 రోజులవుతుండటంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డు కనిష్ఠానికి క్షీణించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు తెలిపాయి.

# రేపటి నుంచి యూపీఐలో కొత్త ఫీచర్..పిన్ నొక్కకుండానే చెల్లింపులు..

డిజిటల్ చెల్లింపుల రంగంలో మరో అద్భుతమైన మార్పు రాబోతోంది. రేపటి నుంచి (అక్టోబర్ 8, 2025) యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) వినియోగదారులు పిన్ లేదా పాస్‌వర్డ్ నొక్కకుండానే చెల్లింపులు చేసుకోవచ్చు. ఎలాగంటే? మీ ముఖం లేదా వేలిముద్ర ద్వారా చేసుకునే ఛాన్సుంది. బయోమెట్రిక్ ఆధారిత గుర్తింపు విధానంతో యూపీఐ చెల్లింపులు ఇకపై మరింత సులభం కానున్నాయిఇప్పటివరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడానికి మనం నాలుగు లేదా ఆరు అంకెల పిన్‌ను ఎంటర్ చేయాల్సి వస్తుంది. కానీ ఇకపై ఆ పిన్ అవసరం లేదు. భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ ఆధారంగా నమోదైన మీ బయోమెట్రిక్ డేటా (ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర) ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ సాంకేతికత మీ గుర్తింపును త్వరగా ధృవీకరించి, సురక్షితంగా లావాదేవీలను పూర్తి చేస్తుంది.

ఈ మార్పు ఎందుకు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల డిజిటల్ చెల్లింపుల కోసం పిన్‌తో పాటు ఇతర గుర్తింపు పద్ధతులను అనుమతించింది. దీనిలో భాగంగా బయోమెట్రిక్ ఆధారిత ధృవీకరణ విధానం అమల్లోకి వస్తోంది. ఈ కొత్త ఫీచర్ యూపీఐ చెల్లింపులను మరింత వేగవంతం చేయడమే కాకుండా, వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. పిన్‌ను గుర్తుంచుకోవడం లేదా టైప్ చేయడం వంటి ఇబ్బందులు ఇక ఉండవు.




ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుంది?

మీరు యూపీఐ యాప్ ద్వారా చెల్లింపు చేయాలనుకున్నప్పుడు, పిన్ ఎంటర్ చేయడానికి బదులు మీ స్మార్ట్‌ఫోన్ కెమెరా ద్వారా ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర స్కానర్ ద్వారా ధృవీకరణ చేయాలి. ఈ డేటా ఆధార్ డేటాబేస్‌తో సరిపోల్చబడి, క్షణాల్లోనే మీ లావాదేవీ పూర్తవుతుంది.ఈ ప్రక్రియ వేగవంతం కావడమే కాదు, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ డేటా కారణంగా సురక్షితంగా ఉంటుంది. ఈ బయోమెట్రిక్ ఫీచర్ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుంది. ప్రధానంగా టెక్నాలజీ పెద్దగా పరిచయం లేని వారు, పిన్‌ను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడేవారికి ఇది సౌలభ్యంగా ఉంటుంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006